# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

శనివారం, హైదరాబాద్ 01.02.2025 | 24 క్యారెట్లు 84,700.00 | కిలో వెండి 1,07,000.00 | 32 °C | సంపుటి:3 | సంచిక:101

www.vishalabharati.com


## వచ్చే ఏడాది 6.36.8% వృద్ధి

- నిత్యావసరాల ధరలు దిగొస్తాయి
- కేంద్ర ఆర్థిక సర్వే ఆశాభావం
- మార్చి నాటికి ఆహార ద్రవ్యోల్బణం తగ్గుముఖం..
- 2047 నాటికి 8% వృద్ధి అవసరం
- పెట్టుబడులను జీడీపీలో 35 శాతానికి పెంచాలి
- ఏఐ, రోబోటిక్స్, బయోటెక్నాలజీ రంగాల్లో మరిన్ని పెట్టుబడులు
- ఆర్థిక సర్వేను పార్లమెంట్‌కు సమర్పించిన మంత్రి సీతారామన్
- నేడే కేంద్ర బడ్జెట్.. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న నిర్మల

విశాలభారతి, నేషనల్ బ్యూరో:



వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో భారత జీడీపీ వృద్ధి రేటు 6.36.8 శాతం శ్రేణిలో నమోదు కావచ్చని 2024-25 ఆర్థిక సర్వే నివేదిక అంచనా వేసింది. బలమైన ఆర్థిక మూలాలు,

..మిగతా 3 లో



## నేను కొడితే.. మామూలుగా ఉండదు

- నేను కొడితే.. మామూలుగా ఉండదు
- ఇన్ని రోజులు మౌనంగా, గంభీరంగా చూస్తున్నా
- అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్
- రైతుబంధుకు రాం రాం.. దళితబంధుకు జై భీం
- నేను ముందే చెప్పినా ప్రజలు వినలేదు
- అత్యాశకు పోయి కాంగ్రెస్‌కు ఓట్లు వేశారు
- కైలాసంలో పాము మింగినట్లుగా రాష్ట్రం పరిస్థితి
- ప్రజల్లో కాంగ్రెసోళ్లు దొరికితే కొడదామనేంత కోపం
- ప్రత్యక్ష పోరాటాలకు కార్యకర్తలు సిద్ధం కావాలి
- ఈ నెలాఖరున భారీ సభ పెడదాం.. తరలి రండి
- రాబోయే రోజుల్లో విజయం బీఆర్ఎస్‌దే: కేసీఆర్
- ఫాంహౌస్‌లో జహీరాబాద్ కార్యకర్తలతో భేటీ

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ నిప్పులు చెరిగారు. అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని ఆరోపించారు. ఏడాది పాలనలో రాష్ట్రంలో ప్రజలెవరూ సంతోషంగా లేరని, కాంగ్రెస్ గత పాలనలో మాదిరిగా మళ్లీ కరెంటు కోతలు, మంచినీటి సమస్యలు మొదలయ్యాయని విమర్శించారు. ప్రభుత్వ పాలనా వైఫల్యాలను ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. గ్రామాల్లో ప్రజలకు కాంగ్రెస్ వాళ్లు దొరికితే కొట్టేటట్టు ఉన్నారని వ్యాఖ్యానించారు. ప్రభుత్వం తీరును తాను ఇన్ని రోజులు మౌనంగా, గంభీరంగా చూస్తున్నానని తెలిపారు. తాను కొడితే మామూలుగా ఉండదని, గట్టిగా కొట్టడం తనకున్న అలవాటని అన్నారు. శుక్రవారం సిద్ధిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో

..మిగతా 2 లో

## దమ్ముంటే అసెంబ్లీకి రా.. తేల్చుకుందాం

- బలంగా కొట్టడం కాదు... ముందు సరిగ్గా నిలబడండి
- రాష్ట్రాన్ని అప్పులపాలు చేసింది మీరే
- ఫామ్‌హౌస్‌లో పడుకుని ఎవరిని గంభీరంగా చూస్తున్నావ్..
- త్వరలో అసెంబ్లీలో బీసీ కులగణన, వర్గీకరణపై చర్చ పెడతాం
- పొంకనాలు కొట్టడం కాదు.. దమ్ముంటే అసెంబ్లీకి రా
- నీ రాక కోసం ప్రజలెవరూ ఎదురు చూడటం లేదు
- వేములవాడ రాజన్నను మోసం చేసిన చరిత్ర నీది
- కేసీఆర్ ఓ చెల్లని వెయ్యి రూపాయల నోటు..
- ఆయన మానసిక పరిస్థితి సరిగా లేదని వ్యాఖ్య
- బీఆర్ఎస్ అధినేతపై సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజం

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

. ''కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా ఫామ్‌హౌస్‌లో పడుకొని కొడుకు, అల్లుడిని ఊర్లపైకి ఉసిగొల్పుతున్నడు. జహంగీర్‌పీర్ దర్గా, వేములవాడ రాజన్నలను మోసం చేసిన చరిత్ర నీది. నీ రాక కోసం తెలంగాణ ప్రజలెవరూ ఎదురు చూడటం లేదు. నువ్వో చెల్లని వెయ్యి రూపాయల నోటువు. ఆ నోటును ఎవరైనా జేబులో పెట్టుకునిపోతే.. జైలుకు వెళ్లడం ఖాయం. కొడితే బలంగా కొడతానని అంటున్నారు. కొట్టడం కాదు ముందు సరిగ్గా నిలబడటం నేర్చుకో. సోషల్ మీడియా టిక్‌టాక్‌లో తనకు ఎక్కువ మార్కులు వచ్చాయని గొప్పలు చెప్పుకొంటున్నారు. సల్మాన్‌ఖాన్‌కు రాఖీ సావంత్‌కు మధ్య పోటీపెడితే ఎక్కువ లైకులు రాఖీ సావంత్‌కే వచ్చాయి. అంత మాత్రన సల్మాన్‌ఖాన్ గొప్పవాడు కాకుండా పోతాడా? ఆయన ఆరోగ్య పరిస్థితి బాగులేదు కేసీఆర్ మానసిక ఆరోగ్య పరిస్థితి సరిగా లేదు. ఆయన కుటుంబ సభ్యులు యమకింకరులై తిరుగుతున్నారు. ఫామ్‌హౌస్‌లో పడుకుని సోది చెప్పుకోవడం కాదు. అసెంబ్లీకి రా.. అన్ని లెక్కలు వివరిస్తాం. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి పనులను, చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను అభినంచడానికి మనసు రాకపోతే ఫామ్‌హౌస్‌లోనే పడుకో. పాలమూరు, జూరాల ఎత్తిపోతల, కోయల్‌సాగర్ కడతానని హామీ ఇచ్చి.. ప్రజలను మోసం చేశావు. నువ్వు ఎన్ని చెప్పినా తెలంగాణ ప్రజలు నిన్ను

..మిగతా 2 లో



"కేసీఆర్ గత 14 నెలలుగా ఫామ్‌హౌస్‌లో పడుకొని గంభీరంగా చూస్తున్నానని అంటున్నారు. ఎవరిని చూస్తున్నావు? ఎందుకు చూస్తున్నావు? బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ అంశంపై చర్చించేందుకు ఫిబ్రవరి మొదటి వారంలో అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయబోతున్నాం. ఫామ్‌హౌస్‌లో పడుకుని పొంకనాలు కొట్టడం కాదు. దమ్ముంటే అసెంబ్లీకి రా.. అన్ని లెక్కలు తేల్చుకుందాం." అని మాజీ సీఎం కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాల 150వ వార్షికోత్సవానికి సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు



## కోడ్ సాకుతో రైతు భరోసా ఆపే కుట్ర

- అన్ని పథకాలను కొనసాగించాలి
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు

..మిగతా 2 లో



## కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నరేందర్‌రెడ్డి

- కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గంలో పోటీ
- ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రకటన

..మిగతా 2 లో




## రెండేళ్లలో నయా ఉస్మానియా

- 2700 కోట్లతో కొత్త భవనం
- శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్
- 41 ఆపరేషన్ థియేటర్లు, 2 వేల బెడ్లు, 500 పడకలతో ఐసీయూ
- 30 ప్రత్యేక వైద్య విభాగాలు
- వైద్యారోగ్య మంత్రి దామోదర రాజనర్సింహ


విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ప్రభుత్వ ఉస్మానియా ఆసుపత్రి కొత్త భవనం కల సాకారం కాబోతోంది. హైదరాబాద్ గోషామహల్ పోలీస్ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం ఆసుపత్రి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి,

..మిగతా 2 లో

## తెలంగాణలో జీబీఎస్ కేసు

- ప్రభుత్వం హైఅలర్ట్
- సిద్దిపేట మహిళలకు సోకిన కొత్తవైరస్



..మిగతా 2 లో

## పార్టీ మారిన ఎమ్మెల్యేలకు..సుప్రీంకోర్టు ఝలక్..!

- ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణయానికి ఇంకెంత సమయం కావాలి..?
- 10 స్థానాల్లో ఉప ఎన్నికలు తప్పవా..?
- ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పిటిషన్‌పై విచారణ
- ఇంకెప్పుడు చర్యలు తీసుకుంటారు..?
- స్పీకర్ తీరుపై సుప్రీంకోర్టు అసహనం
- వేటు తప్పదంటున్న బీఆర్ఎస్ వర్గాలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:



రాష్ట్రంలో పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలకు సుప్రీంకోర్టు ఝలక్ ఇచ్చింది. శుక్రవారం నాడు ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ జార్జి మైస్‌లతో

..మిగతా 3 లో




## పన్ను వసూళ్లలో తెలంగాణ ఫస్ట్

- సాగు విస్తీర్ణంలో మూడో స్థానం
- సాగునీరు అందే భూములు 86 శాతం

..మిగతా 4 లో

## భారత్‌ను గ్లోబల్ పవర్‌హౌస్‌గా మార్చడమే లక్ష్యం

- ఏఐ, డిజిటల్ టెక్నాలజీలో ప్రపంచానికి మనం ఆదర్శం
- పార్లమెంటులో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

విశాలభారతి, నేషనల్ బ్యూరో:

పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు

..మిగతా 2 లో



vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

శనివారం,
01.02.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## మా పథకాలతో నెలకు రూ.25వేలు ఆదా

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**

ఆప్ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఢిల్లీలోని ప్రతి కుటుంబానికి నెలకు రూ.25వేలు ఆదా అవుతోందని ఆ పార్టీ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి వస్తే తమ కొత్త పథకాలతో మరో రూ.10 వేలు ఆదా అవుతుందన్నారు. తమ పార్టీ పథకాల ద్వారా ఢిల్లీ ప్రజలకు జరిగిన ఆర్థిక లబ్ధిని వివరించేలా 'బచత్ పత్ర' (పొదుపు కాగితం) పేరుతో శుక్రవారం ఆయన ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆప్ వాలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రతినెలా వారు ఎంత సొమ్మును ఆదా చేస్తున్నారో తెలుసుకుని జాబితా తయారు చేస్తారని కేజ్రీవాల్ చెప్పారు.

## దమ్ముంటే అసెంబ్లీకి రా..

# తేల్చుకుందాం

మొదటి పేజీ తరువాయి



నమ్మే పరిస్థితిలో లేరు.

**ఏడాదిలో ఎన్నో చేశాం..**

మా ఏడాది పాలనలో రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశాం. సన్నాలకు రూ.500 బోనస్ ఇచ్చాం. 24 గంటల కరెంట్ ఇస్తున్నాం. 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే గృహాలకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నాం. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. ఏడాదిలోనే 55,143 ఉద్యోగాలు భర్తీ చేశాం. రైతు భరోసా కింద ఎకరానికి రూ.12 వేలు ఇస్తున్నాం. భూమి లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద నగదు అందజేస్తున్నాం, రైతును రాజును చేస్తున్నాం.

**ప్రభుత్వ విద్యకు బడ్జెట్ 15 శాతానికి పెంచుతాం**

దివంగత వైఎస్సార్ పాలనలో జిల్లాకో యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. అనేక ప్రభుత్వ పాఠశాలలను నెలకొల్పాం. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టి పేదలకు ఉన్నత చదువులు చదివే అవకాశం కల్పించాం. పదేళ్ల కేసీఆర్ పాలనలో ప్రభుత్వ విద్యారంగం పూర్తిగా నిర్వీర్యమైంది. ఉస్మానియా, కాకతీయ వర్సిటీలు పునరావాస కేంద్రాలుగా మారాయి. అవి ప్రతిష్టను కోల్పోయే పరిస్థితికి దిగజార్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చాం. బడ్జెట్‌లో ఏడు శాతం నిధులు కేటాయించాం. తండాలు, మారుమూల గ్రామాల్లో మూసివేసిన అనేక పాఠశాలలను పునఃప్రారంభించాం. 11 వేల కొత్త ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశాం. భవిష్యత్తులో విద్యకు బడ్జెట్‌ను 15 శాతానికి పెంచాలని నిర్ణయించాం.

**స్టాన్‌ఫర్డ్ వర్సిటీతో ఎంఓయూకు యత్నం**

మహాత్మాగాంధీ నడిపిన యంగ్ ఇండియా పత్రిక స్ఫూర్తితో విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాలను అందించేందుకు 'యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్'ను ఏర్పాటు చేస్తున్నాం. రూ.2,400 కోట్లతో 75 ఐటీఐలను ఆధునీకరించాం. టాటా కంపెనీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాం. సింగపూర్ నుంచి నిపుణులను ఇక్కడికి రప్పించి, నిరుద్యోగులకు ఆయా అంశాల్లో శిక్షణ ఇప్పించే ప్రయత్నం చేస్తున్నాం. ప్రఖ్యాత స్టాన్‌ఫర్డ్ వర్సిటీతో ఎంఓయూ కోసం ప్రయత్నిస్తున్నాం. కేవలం చదువుకున్నవారికే కాదు ఆటల్లో రాణిస్తున్నవారికీ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. బాక్సింగ్ చాంపియన్ నిఖత్ జరీన్‌కు డీఎస్పీ ఉద్యోగంతోపాటు రూ.2 కోట్ల ఆర్థిక సాయం అందించాం. పెద్దగా చదువు లేని సిరాజుద్దీన్ సహా దీప్తికి గ్రూప్-2 ఉద్యోగం, ఆర్థిక సాయం, ఇంటి స్థలం ఇచ్చి ప్రోత్సహించాం..'' అని సీఎం రేవంత్ తెలిపారు.

**మొగిలిగిద్దకు రూ.16 కోట్లు**

మొగిలిగిద్ద పాఠశాల తెలంగాణకే వన్నె తెచ్చిందని, ఇక్కడ చదువుకున్న వారిలో ఇద్దరు సీఎంలు, గవర్నర్, మాజీ మంత్రి, ప్రొఫెసర్ సహా అనేక మంది ఉన్నారని సీఎం గుర్తు చేశారు. ఇలాంటి చారిత్రక స్కూలు ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఉండటం గర్వకారణమని పేర్కొన్నారు. మొగిలిగిద్దలో పాఠశాల భవనం, గ్రామ పంచాయతీ భవనం, సీసీ రోడ్ల కోసం రూ.16 కోట్లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. ఇక్కడి విద్యార్థులకు వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చేందుకు 'అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్'ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ బహిరంగ సభలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నరేందర్‌రెడ్డి

- కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గంలో పోటీ
- ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రకటన

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికకు కాంగ్రెస్ తమ పార్టీ అభ్యర్థిని ప్రకటించింది. ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వావిలాల నరేందర్ రెడ్డిని ఎమ్మెల్సీ క్యాండిడేట్‌గా ఖరారు చేసింది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ 2025, జవనరి 31న ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఈ స్థానం నుంచి కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి ఎమ్మెల్సీగా ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయన పోటీ చేయడానికి ఆసక్తి చూపకపోవడంతో నరేందర్ రెడ్డికి లైన్ క్లియర్ అయ్యింది. కాంగ్రెస్ టికెట్ దక్కుతుందని నమ్మకంతో అధికారిక ప్రకటన కంటే ముందే ఆయన ప్రచారం మొదలుపెట్టారు.

ఆయన అంచనాల మేరకు పార్టీ అధిష్ఠానం నరేందర్ రెడ్డికే టికెట్ కేటాయించింది. కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి బీజేపీ తమ పార్టీ అభ్యర్థిగా సి.అంజిరెడ్డి పేరును ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రతి పక్ష పార్టీ, ఉత్తర తెలంగాణలో గట్టి పట్టున్న బీఆర్ఎస్ మాత్రం ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీపై ఆసక్తి చూపడం లేదు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను ప్రకటించి ప్రచారం మొదలుపెట్టగా.. బీఆర్ఎస్ మాత్రం సైలెంట్‌గా ఉంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికల రేసుకు దూరంగా ఉండే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తుండటంతో.. కాంగ్రెస్, బీజేపీ మధ్య ప్రధాన పోరు ఉండనున్నట్లు తెలుస్తోంది.

కాగా, రాష్ట్రంలో 3 ఎమ్మెల్సీ స్థానాలకు ఇప్పటికే ఎన్నికల నగారా మోగిన విషయం తెలిసిందే. ఒక గ్రాడ్యుయేట్, 2 టీచర్ ఎమ్మెల్సీ ఎలక్షన్స్‌కు షెడ్యూల్ రిలీజ్ అయింది. ఖాళీగా ఉన్న ఈ 3 స్థానాలకు 2025, ఫిబ్రవరి 27న ఎలక్షన్ నిర్వహించనున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) ప్రకటించింది. ఈ మేరకు బుధవారం ఎలక్షన్ షెడ్యూల్ రిలీజ్ చేసింది. వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ, మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ -కరీంనగర్ ఉపాధ్యాయ, మెదక్- నిజామాబాద్-ఆదిలాబాద్ - కరీంనగర్ పట్టభద్రుల స్థానానికి ఎన్నికలు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్టు ఈసీ ప్రకటించింది. ఫిబ్రవరి 10 నామినేషన్లకు చివరి తేదీగా ప్రకటించింది. ఫిబ్రవరి 13 వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించింది. ఫిబ్రవరి 27న పోలింగ్ నిర్వహించి, మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నది.

# నేను కొడితే.. మామూలుగా ఉండదు

మొదటి పేజీ తరువాయి

జహీరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తలతో కేసీఆర్ సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కరోనా కష్టకాలంలో సైతం తాము రైతులకు రైతుబంధు ఇచ్చామని, కానీ.. ప్రస్తుతం రైతుబంధుకు రాం... రాం.. దళితబంధుకు జైభీం అన్నట్లుగా పరిస్థితిని కాంగ్రెస్ పార్టీ మార్చిందని అన్నారు. సంగమేశ్వరం, బసవేశ్వర, పాలమూరు, కాళేశ్వరం పనులు నిలిచిపోయాయని, పథకాలు, అభివృద్ధి.. అన్నింటినీ గంగలో కలిపారని దుయ్యబట్టారు. కైలాసంలో పాము మింగినట్లుగా తెలంగాణ పరిస్థితి మారిందని, కాగ్ సైతం రాష్ట్ర ఆదాయం గతంతో పోలిస్తే రూ.13 వేల కోట్లు తగ్గిందని చెప్పిందన్నారు. కాంగ్రెస్ వాళ్లు పాలన తీరుపై పోలింగ్ పెడితే బీఆర్ఎస్‌కే ఎక్కువ ఓటింగ్ వచ్చిందని కేసీఆర్ గుర్తు చేశారు. తాను ముందే చెప్పానని, ప్రజలు వినలేదని, తులం బంగారం అనగానే అత్యాశకు పోయి కాంగ్రెస్‌కు ఓటేశారని అన్నారు. ఇప్పుడిప్పుడే మబ్బులు తొలగిపోతున్నాయని, ప్రజలకు ఇదొక గుణపాఠం లెక్క అయిందని వ్యాఖ్యానించారు. ''ఫాంహౌస్ అంటూ బద్నాం చేశారు. ఫాంహౌస్‌లో ఏముంటాయి? వరి ఉంటది.. మక్క ఉంటది.. అల్లం ఉంటది'' అని అన్నారు. రాబోయే రోజుల్లో విజయం తమదేనన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించింది గులాబీ జెండా అని, తెలంగాణను దేశంలో అగ్రస్థానంలో నిలిపిందీ గులాబీ జెండాయేనని ఉద్ఘాటించారు. గులాబీ జెండాతోనే తెలంగాణకు రక్ష అని అన్నారు. తానుండగా తెలంగాణకు అన్యాయం జరగనివ్వనని, ప్రజాక్షేత్రంలో పోరాటాలకు సిద్ధమని ప్రకటించారు. ''బీఆర్ఎస్ విజయం తెలంగాణ ప్రజల విజయం కావాలి. ప్రత్యక్ష పోరాటాలకు కార్యకర్తలు సిద్ధం కావాలి. ఫిబ్రవరిలో భారీ సభ పెడదాం.. ప్రజలంతా తరలిరావాలి. కాంగ్రెస్ పార్టీ ముస్లింలను ఓట్ల కోసం వాడుకుంటుంది. తెలంగాణలో ఉన్న ప్రతి బిడ్డ మనోడే'' అని కేసీఆర్ అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎ.జీవన్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఫామ్‌హౌస్ నుంచి సమావేశ మందిరానికి హరీశ్‌రావును వెంటబెట్టుకొని కేసీఆర్ స్వయంగా కారును నడుపుకొంటూ వచ్చారు.



# రెండేళ్లలో నయా ఉస్మానియా

మొదటి పేజీ తరువాయి

పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, సీఎస్ శాంతికుమారి, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, వైద్యులు హాజరయ్యారు. ''ఇది చాలా చరిత్రాత్మక దినం. 30 ఏళ్ల కల నెరవేరబోతోంది. కొత్త ఆసుపత్రి రోగులకు ఒక భరోసా ఇస్తుంది. అన్ని రకాల అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి'' అని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఆసుపత్రి నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేసిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. కొత్తగా జెరియాట్రిక్, పాలియేటివ్, ట్రాన్స్‌ఫ్యూజన్, అడ్మినిస్ట్రేటివ్, రుమటాలజీ, ఫిజియోథెరపీ, అత్యవసర మెడిసిన్, జెనెటిక్స్ విభాగాలు రానున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజలకు ఇబ్బంది లేకుండా...చిన్న చిన్న వ్యాపారాలు దెబ్బతినకుండా అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ''నాలుగు వైపులా విశాలమైన రహదారులు నిర్మించనున్నాం. దీంతో ఇక్కడ వ్యాపార, ఇతర కార్యకలాపాలు మరింత పెరగనున్నాయి. ఆసుపత్రి పక్కనే ఉన్న పోలీస్ గ్రౌండ్‌లో హెలిప్యాడ్ నిర్మించి...అత్యవసర పరిస్థితిలో రోగులను ఎయిర్‌లిఫ్ట్ చేసేందుకు వాడుకునేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. వచ్చే రెండేళ్లలో కొత్త భవనం పూర్తి చేయనున్నాం. తెలంగాణలో తొలిసారి ఎక్కువ మంది వైద్యులు శాసన సభ్యులుగా గెలిచారు. వారు కూడా కొత్త భవనం కావాలని కోరుకుంటున్నారు'' అని మంత్రి వివరించారు.

రూ.2700 కోట్లతో నిర్మించే ఈ ఆస్పత్రిని రెండున్నరేళ్ల నుంచి మూడేళ్లలో పూర్తి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. 26.30 ఎకరాల్లో విశాలమైన ప్రాంగణంలో 32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో ఆస్పత్రిని నిర్మిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఉస్మానియా ఆస్పత్రిలో 1168 పడకలు ఉన్నాయని, కొత్త ఆస్పత్రిలో 2 వేల పడకలు అందుబాటులో ఉంటాయని, ఇందులో 500 పడకల సామర్థ్యంతో ఐసీయూను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆస్పత్రిలో ప్రస్తుతం 22 వైద్య విభాగాలు ఉండగా.. వాటిని 30కి పెంచుతున్నామని చెప్పారు. సుమారు 41 ఆపరేషన్ థియేటర్లు అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. ఆస్పత్రి ప్రాంగణంలోనే డెంటల్, నర్సింగ్, ఫిజియోథెరపీ కాలేజీలు ఉంటాయని వివరించారు. విద్యార్థులు, ఫ్యాకల్టీకి అధునాతన వసతులతో కూడిన హాస్టల్ సదుపాయం, 750 సీట్ల సామర్థ్యంతో ఆడిటోరియం, క్రీడా ప్రాంగణాలు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. దాదాపు 3 వేల వాహనాలు ఒకేసారి పార్కింగ్ చేసుకునేలా అండర్‌గ్రౌండ్ పార్కింగ్ సిస్టమ్ ఉంటుందన్నారు. రాబోయే వందేళ్లు ప్రజలు గుర్తుంచుకునేలా అంతర్జాతీయ ప్రమాణాలు, అత్యాధునిక సాంకేతికతతో ఆస్పత్రి నిర్మాణం చేపట్టనున్నట్లు ఆయన చెప్పారు. 1919 నుంచి వందేండ్లకు పైగా ఇక్కడి ప్రజలకు ఉస్మానియా ఆస్పత్రితో అనుబంధం ఉందని, ఇక్కడి వాళ్లకు ఆస్పత్రిని దూరం చేయకుండా ఇక్కడే నిర్మిస్తున్నామన్నారు.

# కోడ్ సాకుతో రైతు భరోసా ఆపే కుట్ర

- అన్ని పథకాలను కొనసాగించాలి
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు


**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



ఎన్నికల కోడ్‌తో ముడిపెట్టి రైతు భరోసాను ఆపకూడదని, ఇది కొనసాగుతున్న పథకమే కాబట్టి రైతు ఖాతాల్లో సొమ్ము జమ చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ''ఎన్నికల కోడ్ పట్టభద్రులు, ఉపాధ్యాయులకే పరిమితం. రైతు భరోసాతో ఎన్నికలను ప్రభావితం చేసే అవకాశమే లేదు. అవసరమైతే బీజేపీ పక్షాన ఎన్నికల సంఘానికి లేఖ పంపిస్తాం. తక్షణమే అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించండి. అందరం కలిసి విజ్ఞప్తి చేద్దాం. ప్రస్తుతం గిట్టుబాటు ధర రాక, పంట పెట్టుబడులు పెరిగి రైతులు ఇబ్బందుల్లో ఉన్నారు. ఈ తరుణంలో చేతికందే సొమ్మును కూడా ఆపేస్తే తీవ్రంగా నష్టపోతారు. రాష్ట్రవ్యాప్తంగా 40 లక్షల మంది రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. వీరిలో 40 వేల మందికి మాత్రమే మంజూరు చేసి మిగిలిన 99 శాతం మంది పేదలకు ఆపేయడం అమానవీయం. రాష్ట్రవ్యాప్తంగా ఇళ్ల కోసం అందిన 70 లక్షలకు పైగా దరఖాస్తుల్లో దాదాపు 40 లక్షల మంది పేదలు ఇళ్లకు అర్హులని తేలింది. ఇప్పటి వరకు 72,406 మందికి మాత్రమే ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. తక్షణమే ప్రతి ఒక్క లబ్ధిదారుడికి రైతు భరోసాతో పాటు మిగతా పథకాలకు సంబంధించి లబ్ధి చేకూర్చే ప్రక్రియను కొనసాగించాలి'' అని ఆయన డిమాండ్ చేశారు.

# తెలంగాణలో జీబీఎస్ కేసు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



దేశంలో గులియన్ బారే సిండ్రోమ్ కలకలం సృష్టిస్తోంది. ఇటీవల మహారాష్ట్రలో మొదలైన గులియన్ బారే సిండ్రోమ్ కేసులు తెలంగాణలో కూడా నమోదవ్వడం మొదలైంది. కోవిడ్ తరువాత వైరస్ మాట వింటే జనం హడలిపోతున్నారు. అందులోనూ కొత్త వైరస్ అంటే ఇంకాస్త ఆందోళన తప్పదు. తాజాగా తెలంగాణలో నమోదైన గులియన్ బారే సిండ్రోమ్ కేసు ఆందోళన కలిగిస్తోంది. సిద్దిపేటకు చెందిన ఓ మహిళకు జీబీఎస్ వైరస్ లక్షణాలు సోకినట్లు వైద్యులు గుర్తించారు. హైదరబాద్ కిమ్స్ ఆసుపత్రిలో ఉంచి మహిళలకు వైద్యం అందిస్తున్నారు. చైనా పుణ్యమా అంటూ కొత్త వైరస్ వ్యాప్తి ఏ రోజు ఎలా ఉంటుందో అనే భయం ప్రపంచదేశాలను వెంటాడుతోంది. కోవిడ్ భయం తరువాత సాధారణ పరిస్థితులు రావడానికి, ఆర్థికంగా అన్ని వ్యవస్థలు పుంజుకోవడానికి చాలా సమయం పట్టింది. ఇప్పుడున్న పరిస్థితిలో కొత్త వైరస్‌ను ఎదుర్కోవడం అంటే కష్టం. వ్యాక్సినేషన్ పూర్తైన తరువాత ఇమ్యూనిటీ శక్తి పెరిగినప్పటికీ కొత్తగా రూపాంతరం చెందుతున్న వైరస్‌లను లైట్ తీసుకుంటే ప్రమాదమే. కోవిడ్ మిగిల్చిన విషాధ పరిస్థితులను తట్టుకునేందుకు మారిన జీవన విధానం, వర్క్ ఫ్రమ్ హోమ్ వంటి మార్పులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. వైరస్ అంటే చాలు వామ్మో అనే పరిస్థితులలోనే జీబీఎస్ వ్యాప్తిపై టెన్షన్ మొదలైంది. పశ్చిమబెంగాల్‌లో జీబీఎస్ వైరస్ కారణంగా గత నాలుగు రోజుల్లో ఓ చిన్నారి సహా ముగ్గురు మరణించారు. మహారాష్ట్రలోని పుణెలోనూ దాదాపు 130 జీబీఎస్ అనుమానాస్పద కేసులు నమోదయ్యాయి. తెలంగాణాలో జీబీఎస్ కేసు నమోదు కావడంతో అధికారులు మరింత అప్రమత్తమైయ్యారు.

## భారత్‌ను గ్లోబల్ పవర్‌హౌస్‌గా

# మార్చడమే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు. అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించడంలో రైతులు, సైనికులు, సైన్స్‌తో పాటు పరిశోధనలు చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయన్నారు. భారతదేశాన్ని గ్లోబల్ పవర్ హౌస్‌గా మార్చడమే మా లక్ష్యం. దేశంలోని విద్యా సంస్థల్లో పరిశోధనలను ప్రోత్సహించేందుకు 50 వేల కోట్ల రూపాయల వ్యయంతో నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ స్థాపించాము. మధ్యతరగతి గృహాలు, గిరిజన సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించిందని, అలాగే చిన్న వ్యాపారులకు సైతం రుణాలను రెట్టింపు చెసినట్లు చెప్పారు. మహాకుంభ్‌లో ఉత్సవం జరుగుతోందని, మౌని అమావాస్య నాడు జరిగిన ప్రమాదం పట్ల నా సంతాపాన్ని తెలియజేస్తున్నాను అని అన్నారు. అలాగే మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పిస్తున్నానని అన్నారు. భారతదేశంలో నిర్మించిన గగన్‌యాన్‌లో భారతీయ పౌరుడు అంతరిక్షంలోకి వెళ్ళే రోజు ఎంతో దూరంలో లేదని వ్యాఖ్యానించారు. కొన్ని రోజుల క్రితం స్పేస్ డాకింగ్‌లో విజయం సాధించడం వల్ల భారతదేశం తన స్వంత స్పేస్ స్టేషన్‌ను కలిగి ఉండటానికి మార్గం మరింత సులభతరం చేసిందన్నారు. దేశంలో మహిళల నేతృత్వంలోని అభివృద్ధిని తమ ప్రభుత్వం విశ్వసిస్తుందన్నారు. విద్యకు ఎవ్వరు కూడా దూరంగా ఉండకూదనే ఉద్దేశంతో మాతృభాషలో విద్యకు అవకాశాలు అందిస్తున్నామన్నారు. 13 భారతీయ భాషల్లో వివిధ రిక్రూట్‌మెంట్ పరీక్షలను నిర్వహించడం ద్వారా భాష సంబంధిత అడ్డంకులు తొలగుతాయని భావించామని, అందుకే భాషా పరంగా ప్రాముఖ్యత ఇచ్చామన్నారు రాష్ట్రపతి ముర్ము. ఆయుష్మాన్ భారత్ పథకం కింద 70 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న 6 కోట్ల మంది సీనియర్ సిటిజన్లకు ఆరోగ్య బీమా కల్పించాలని నిర్ణయించడం జరిగిందని అన్నారు. యువత విద్య, వారికి కొత్త ఉపాధి అవకాశాలను సృష్టించడంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందన్నారు. మధ్యతరగతి ప్రజల కోసం ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ప్రభుత్వం కూడా మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోంది. దేశం వేగంగా నిర్ణయాలు తీసుకుంటోందని, మోదీ మూడో టర్మ్‌లో దేశంలో 3 రెట్లు వేగంగా పనులు జరుగుతున్నాయన్నారు.

vishalabharathi Telugu Daily
విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం,
01.02.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## ఆదర్శ పాఠశాల విద్యార్థులకు అభినందనలు

సైదాపూర్, విశాల భారతి

సైదాపూర్ మండలంలోని సోమవారం ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఈనెల 18న కరీంనగర్ టౌన్ లో జరిగిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలో ప్రతిభ కనిపించిన సర్వేందర్, లౌకిక ,కుష్మాంజల్, సరూప్ రావు ,సుశాంత్ ,సాయి వర్ధన్ విద్యార్థులను మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంపత్ కుమార్ ఉపాధ్యాయులు ఆదర్శ పాఠశాల య్యాల విష్ణువర్ధన్గౌడ్ లు అభినందించారు.



## హెచ్ యూ జే సంఘం పేరును అక్రమంగా వినియోగిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

- కార్మిక శాఖ అడిషినల్ కమిషనర్ గంగాధర్ కు హెచ్ యూజే నేతల ఫిర్యాదు

హైదరాబాద్, విశాలభారతి:

హైదరాబాద్ గడ్డపై తొలిసారి ప్రభుత్వ గుర్తింపు పొందిన స్థానిక జర్నలిస్టుల సంఘం ''హైదరాబాద్ యునియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్ యూ జే. రి.నెం.B 2794.) పేరును అనధికారికంగా ఉపయోగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని హెచ్ యూ జే ప్రతినిధి బృందం కార్మిక శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. రిజిస్టర్డ్ హెచ్ యూజే సంఘం అధ్యక్షులు బి అరుణ్ కుమార్, కార్యదర్శి బి జగదీశ్వర్ నేతృత్వంలో ప్రతినిధి బృంధం శుక్రవారం కార్మిక శాఖ అదనపు కమిషనర్ డా.గంగాధర్, జాయింట్ కమిషనర్ సునీత గోపాల్ దాస్ తో సమావేశమయ్యారు. జర్నలిస్టుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వాల దృష్టికి తీసుకెళుతూ వాటి పరిష్కారానికి హెచ్ యూ జే నిఖార్సుగా పనిచేస్తున్నదని చెప్పారు. తెలంగాణ యునియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీ యూ డబ్ల్యూ జే) సంఘం తమ హైదరాబాద్ యూనిట్ కు అనధికారికంగా 'హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్ యూ జే) పేరును ఉపయోగిస్తున్నారని వారికి ఫిర్యాదు చేశారు. దానికి సంబంధించిన ఆధారాలు అందజేశారు. ఇండియన్ ట్రేడ్ యునియన్ యాక్టు, 1926 ప్రకారం 2007వ సంవత్సరం జూన్ 27న కార్మిక శాఖలో హెచ్ యూ జే రిజిస్ట్రేషన్ జరిగిందని, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) అనుబంధ సంఘంగా హెచ్ యూ జే కొనసాగుతోందని వారికి వివరించారు. అనధికారికంగా తమ సంఘం హెచ్ యూ జే పేరు వాడుతున్న వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని వారు కార్మిక శాఖ అదనపు కమిషనర్ డా.గంగాధర్ ను కోరారు. దీంతో ఆయన స్పందించి విచారణ చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని గంగాధర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్ యూజే ట్రెజరర్ బి.రాజశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గంద్ర నవీన్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ సీహెచ్ మధుకర్, హెచ్ యూజే ఉపాధ్యక్షులు ఎం.రమేష్, జి. రేణయ్య, జాయింట్ సెక్రెటరీలు ఎం.జీవన్ రెడ్డి, అచ్చిన ప్రశాంత్, టీడబ్లూజేఎఫ్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ విజయానంద్, నాయకులు హరి ప్రసాద్, రోజారాణి, పలువురు సీనియర్ జర్నలిస్టులు ఉన్నారు.

## వచ్చే ఏడాది 6.36.8% వృద్ధి

మొదటి పేజీ తరువాయి



ఆర్థిక స్థిరీకరణ, నిలకడైన ప్రైవేటు వినియోగం ఇందుకు దోహదపడనున్నాయని సర్వే పేర్కొంది. అయితే, అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగేందుకు అవసరమైన వృద్ధి కంటే ఇది చాలా తక్కువని అభిప్రాయపడింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం పార్లమెంట్‌లో 'ఆర్థిక సర్వే 2024-25' నివేదికను సమర్పించారు. దేశ ప్రస్తుత ఆర్థిక స్థితిగతులను తెలిపే ఈ వార్షిక నివేదికను ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) వీ అనంత నాగేశ్వరన్ పర్యవేక్షణలో ఆర్థిక వ్యవహారాల శాఖ తయారు చేసింది. ఆర్థిక సర్వే నివేదికను తొలిసారిగా 1950-51లో రూపొందించారు. అప్పట్లో బడ్జెట్‌తో కలిపి దీన్ని సమర్పించేవారు. 1960 నుంచి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌కు ముందు రోజు ఈ నివేదికను పార్లమెంట్‌కు సమర్పించడం ప్రారంభించింది.

ఈ మార్చి 31తో ముగియనున్న ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25) జీడీపీ వృద్ధి రేటు నాలుగేళ్ల కనిష్ఠ స్థాయి 6.4 శాతానికి పరిమితం కావచ్చని కేంద్ర గణాంక శాఖ ఇప్పటికే ముందస్తు అంచనాలను విడుదల చేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఎకనామిక్ సర్వే అంచనా వేసిన 6.36.8 శాతం వృద్ధి శ్రేణిలో దిగువ స్థాయి ఈసారి కంటే తక్కువ. అంటే, వచ్చే ఏడాది వృద్ధి మరింత బలహీనపడే అవకాశాలున్నాయనడానికిదే సంకేతం. అంతేకాదు, కొవిడ్ సంక్షోభం అనంతరం భారత్‌కు ఇదే కనిష్ఠ వృద్ధి రేటు కానుంది. గ్రామీణ మార్కెట్ గిరాకీ, పెరిగిన పంట దిగుబడి, తగ్గుముఖం పడుతున్న ఆహార ధరలు, స్థిరమైన ఆర్థిక మూలాలు స్వల్పకాలిక వృద్ధికి దోహదపడనున్నాయని ఆర్థిక సర్వే పేర్కొంది. అయితే, అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ, వాణిజ్య అనిశ్చితులతోపాటు కమోడిటీల ధరలు మళ్లీ పెరిగే అవకాశాలు ఆర్థికాభివృద్ధికి అవరోధంగా పరిణమించే ప్రమాదం ఉందని ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ హెచ్చరించారు.

కూరగాయల ధరలు కాస్త తగ్గడంతో పాటు ఖరీఫ్ పంట చేతికి రానుండటంతో ఈ ఏడాది మార్చి చివరి నాటికి ఆహార ధరల ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టవచ్చని, తద్వారా సామాన్యులకు ధరాఘాతం నుంచి కొంత ఊరట లభించవచ్చని ఆర్థిక సర్వే నివేదిక ఆశాభావం వ్యక్తం చేసింది. రబీ పంట దిగుబడి కూడా మెరుగ్గా ఉంటే వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధం (ఏప్రిల్‌సెప్టెంబరు) లోనూ ఆహార ధరలు అందుబాటులోనే ఉండవచ్చని రిపోర్టు పేర్కొంది. ఆహార ధరలకు కళ్లెం వేసేందుకు పర్యావరణ ప్రతికూలతలను తట్టుకునే వంగడాలను అభివృద్ధి చేయడంతోపాటు పప్పు దినుసులు, వంటనూనెగింజలు, టమోట, ఉల్లి దిగుబడిని పెంచాలని ఆర్థిక సర్వే నివేదిక సూచించింది. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలంటే వచ్చే రెండు దశాబ్దాల పాటు 8 శాతం వార్షిక వృద్ధిని సాధించాల్సిన అవసరం ఉందని ఆర్థిక సర్వే పేర్కొంది. ఆర్థిక వృద్ధిని ప్రేరేపించేందుకు నియంత్రణ సడలింపులతో పాటు భూ, కార్మిక, బిల్డింగ్, యుటిలిటీ సేవలు, ప్రజా సేవల రంగాల్లో సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. అంతేకాదు, పెట్టుబడులను జీడీపీలో ప్రస్తుతమున్న 31 శాతం నుంచి 35 శాతానికి పెంచాలని.. దేశంలో తయారీ రంగాన్ని మరింత అభివృద్ధి చేయాలని, కృత్రిమ మేధ (ఏఐ), రోబోటిక్స్, బయోటెక్నాలజీ వంటి ఆధునిక సాంకేతికతల్లో విస్తృతంగా పెట్టుబడులు పెట్టాలని సూచించింది. అలాగే, 2030-32 వరకు వ్యవసాయేతర రంగాల్లో ఏటా 78.5 లక్షల కొత్త ఉద్యోగాలు సృష్టించాల్సిన అవసరం ఉందని, దేశంలో 100 శాతం అక్షరాస్యతను సాధించడంతో పాటు విద్యా సంస్థల ప్రమాణాలను పెంచాలని, అత్యంత నాణ్యమైన, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన మౌలిక వసతులను త్వరితగతిన అభివృద్ధి చేయాలని కోరింది. అంతేకాదు, దేశంలో వ్యాపార నిర్వహణను మరింత సులభతరంగా మార్చాలని.. ఈ విడత రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దిశగా చర్యలు చేపట్టాలని, నియమావళిని సడలించాలని సూచించింది. కేంద్రం, రాష్ట్రాలు సంస్కరణలను కొనసాగిస్తేనే భారత్ భవిష్యత్ లక్ష్యాలకు అవసరమైన వృద్ధిని సాధించగలదని సర్వే నివేదిక పేర్కొంది.

### ఎల్బీనగర్,వనస్థలిపురం, బి.యన్ రెడ్డి నగర్‌లో

# స్ట్రీట్కో శంకర్దాదా ఎంబీబీఎస్

## ఈ ఫేక్ డాక్టర్లతో జాగ్రత్త సుమీ!!

ఎల్బీనగర్ విశాల భారతి:







రాష్ట్రంలో రోజురోజుకు నకిలీ వైద్యుల సంఖ్య అధికమవుతోంది. సరైన అర్హత ఉండదు వైద్యంపై పట్టు ఉండదు ఎంబీబీఎస్ చేసిన దాఖలాలు అస్సలు ఉండవు. అయినా సరే వైద్యులుగా చలామణి అవుతూ ఇష్టారాజ్యంగా క్లినిక్‌లు ఏర్పాటు చేసి రోగుల ప్రాణాలతో చలగాటమాడుతున్నారు. కొందరు నకిలీ డాక్టర్లు. పల్లెల్లోనే కాదు హైదరాబాద్ నగరంలో ఎల్బీనగర్ లో ఇలాంటి శంకర్ దాదా ఎంబీబీఎస్‌ల సంఖ్య అధికంగా ఉందంటున్నారు వైద్య మండలి సభ్యులు.జలుబు, జ్వరం, ఒళ్లునొప్పులు, వాంతులు, విరేచనాలు ఇలా వ్యాధి ఏదైనా ముందుగా వెళ్లేది దగ్గర్లోని క్లినిక్‌లకే. రోగాలను నయం చేస్తారనే భరోసాతో చికిత్స కోసం వైద్యుడి దగ్గరకు వెళ్లి వేలకు వేలు ఫీజులు చెల్లిస్తాం. అయితే ఇప్పుడు ఆ భరోసానే సమస్యగా మారుతోంది. చికిత్స చేస్తున్నది నిజంగా వైద్యుడా లేదా నకిలీ వైద్యుడా అన్న సందేహం కలుగుతోంది. ఇటీవల హైదరాబాద్‌లోని పలు చోట్ల స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించిన మెడికల్ కౌన్సిల్ భారీగా నకిలీ వైద్యులను గుర్తించటమే ఇందుకు కారణం. నకిలీ వైద్యుల ఆటకట్టించాలని భావించిన రాష్ట్ర మెడికల్ కౌన్సిల్, తెలంగాణ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో రైడ్‌లు నిర్వహించారు.ఈ ఏడాది జనవరి నుంచి మెడికల్ కౌన్సిల్ నకిలీ వైద్యుల కట్టడికి కృషి చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాల్లో పలు మార్లు దాడులు నిర్వహించిన టీఎస్ఎమ్సీ సభ్యులు ఇటీవల హైదరాబాద్ మేడ్చల్ పరిధిలోని ఐడీపీఎల్, చింతల్, షాపూర్నగర్ సహా పలు ప్రాంతాల్లో ఎనిమిది బృందాలుగా ఏర్పడి దాడులు నిర్వహించారు. కొందరు కనీసం డిగ్రీ లేకుండా వైద్యులుగా చలామణి అవుతున్నట్టు గుర్తించారు. మరికొందరు పలు ఆస్పత్రుల్లో నర్సింగ్ వంటి సేవలు అందించి ఆ తర్వాత సొంతంగా ఎంబీబీఎస్ వైద్యులమని మభ్యపెడుతూ క్లినిక్లు ఏర్పాటు చేసినట్టు తనిఖీల్లో తేలింది. మినిమమ్ క్వాలిఫికేషన్ లేకుండా ఎల్బీనగర్ వనస్థలిపురం హయత్ నగర్,పలు ప్రాంతాల్లో, వైద్యాన్ని అందిస్తున్నారు. ఇప్పుడు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ వచ్చాక అన్ని ప్రాంతాలలో కొన్ని కమిటీలు ఏర్పాటు చేసి రైడ్స్ చేస్తున్నాం. రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం అర్హత లేనివారు యాంటీబాడీస్, స్టెరాయిడ్స్ ఇవ్వడానికి ఉండదు కానీ ఈ నకిలీ డాక్టర్లు ఇష్టారీతినా ఇస్తున్నారు. అర్హతలు లేకుండా వైద్యం చేస్తున్నవారికి సంవత్సర కాలంపాటు జైలు శిక్ష అలాగే 5లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుంది." డా. శ్రీనివాస్, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు. ఈ మధ్య ఒక సీనియర్ జర్నలిస్ట్ బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్లో బైక్ పై వెళ్తుండగా చిన్న గాయంతో ఓ ప్రైవేటు క్లినిక్ వెళ్లగా అక్కడ ప్రథమ చికిత్స చేయకపోవడంతో చిన్న గాయానికి కూడా ఆపరేషన్ చేయాలని అనడంతో ఆ వ్యక్తి కంగుతిన్నాడు. అసలు ఇతను డాక్టర్ ఏనా నకిలీ డాక్టర్ అని ఆశ్చర్యపోయాడు.దీనికి తోడు క్లినిక్‌లకు అనుబంధంగా మెడికల్ షాపులు, డయాగ్నోస్టిక్ కేంద్రాలను నిర్వహిస్తున్నారని ఇక ఇలాంటి వారిలో అత్యధిక శాతం మంది రోగులకు ఇష్టారాజ్యంగా మందులు ఇస్తుండటం ఒక్కోసారి రోగి మరణానికి దారి తీస్తోందని టీఎస్ఎమ్సీ కమిటీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. నకిలీ వైద్యులను అరికట్టడానికి ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపట్టాలని వైద్యుల సంఖ్య పెంచి ప్రభుత్వం వైద్యాన్ని బలోపేతం చేయాలని టీఎస్ఎమ్సీ సభ్యులు కోరుతున్నారు.

## రోడ్డు ప్రమాదం లో వ్యక్తి మృతి

పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:



హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి సుమారు రాత్రి 8 గంటలకు సమయంలో ప్రమాదవశాత్తు రోడ్డు క్రాస్ చేస్తూ వ్యక్తి దుర్మారణం చెందినట్లు సి ఐ నాగరాజు గౌడ్ తెలిపారు. వివరాల్లోకి వెళితే...తేజవత్ రమేష్ తండ్రి రాజు, వయస్సు. 29 సంవత్సరాలు నివాసం శాంతి నగర్, హయత్ నగర్ సొంత ఊరు సాదు తండా, మేళ్లచెరువు, సూర్యాపేట జిల్లా అనునతడు అతని స్నేహితుని అల్లుడు అయిన హర్షవర్ధన్ ని ఆల్వల్ లో జీ మైన్స్ ఎక్సమ్ వ్రాయించుకొని తిరిగి ఇంటికి ఆర్టీసీ బస్సు లో వచ్చి భాగ్యలత బస్టాప్, సి యం ఆర్ షాపింగ్ మాల్ ఎదురుగా గల బస్ దిగి రోడ్డు క్రాస్ చేయుచుండగా, ఎల్ బి నగర్ వైపు నుండి హయత్ నగర్ వైపు అతి వేగంగా , అజాగ్రత గా బైక్ నం . పుల్సార్ TG050199 గల దాని పైన వచ్చి టక్కర్ ఇవ్వగ రమేష్ అనునతడు అక్కడికక్కడే మృతి చెందటం జరిగింది, హర్ష వర్ధన్ కి స్వల్ప గాయములు అయినట్లు, ఆక్సిడెంట్ చేసిన వ్యక్తి పెద్ది శివ ప్రసాద్ తండ్రి శ్రీను వయస్సు 20 సంవత్సరాలు వృత్తి. స్టూడెంట్ నివాసం కట్టంగూర్, నల్గొండ జిల్లాకు చెందిన వారు గా గుర్తించారు. మృతుని తండ్రి తేజవత్ రాజు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి

- కుంట్లూరు ఎక్స్ రోడ్డు వద్ద వేగంగా వచ్చిన బస్సు
- డ్రైవర్ నిర్లక్ష్యం తో వ్యక్తి మృతి

పెద్ద అంబర్పేట్, విశాలభారతి;




హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కుంట్లూర్ చౌరస్తా దగ్గరలో మూలమలుపు వద్ద వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తిని ఢీకొట్టడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు సీఐ నాగరాజు గౌడ్ తెలిపారు,ఈ సందర్భంగా మాట్లాడుతు...వివరాలు తేదీ 31.01.2025న సాయంత్రం 06.45 గంటల సమయంలో మృతుడు కుంచం మల్లయ్య స/వెంకులు, వయస్సు: రావిపహాడ్, నల్గొండ జిల్లా వాసి అని , తన బైక్‌పై కుంట్లూరు నుండి హయతానగర్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో కుంట్లూరు ఎక్స్ రోడ్డు వద్దకు వచ్చే సమయంలో ఆర్టీసీ బస్సు నెం. AP 29 Z 3523 డ్రైవర్ తన బస్సును అతివేగంగా మరియు నిర్లక్ష్యంగా నడిపి, ఎదురుగా బైక్ పై వస్తున్న వ్యక్తి ని ఢీకొట్టడంతో వ్యక్తి తలపై నుండి బస్సు వెళ్లడం తో వ్యక్తి అక్కడికక్కడే చనిపోయినట్లు తెలిపారు. ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజు గౌడ్ తెలిపారు.

## పార్టీ మారిన ఎమ్మెల్యేలకు..సుప్రీంకోర్టు ఝలక్..!

మొదటి పేజీ తరువాయి

కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. హైకోర్టు నాలుగు నెలల్లో ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవాలని గత ఏడాది మార్చిలో చెప్పినా ఇంత వరకు నిర్ణయం తీసుకోలేదని కౌశిక్ రెడ్డి తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తగిన సమయంలో స్పీకర్ నిర్ణయం తీసుకోవడం లేదని న్యాయవాది తెలిపారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చామని అసెంబ్లీ కార్యదర్శి తరపు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి.. కోర్టుకు చెప్పారు. నిర్ణయం తీసుకోవడానికి స్పీకర్ ఎమ్మెల్యేలకు తగిన సమయం ఇవ్వాలని గతంలో సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చిందని రోహత్గి గుర్తు చేశారు. ‘‘బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపులపై నిర్ణయం తీసుకోవడానికి... మీ దృష్టిలో తగిన సమయం అంటే ఎంత? రీజనబుల్ టైమ్ అంటే.. మహారాష్ట్ర తరహాలో శాసనసభ గడువు ముగిసేవరకా ?’’ అంటూ తెలంగాణ స్పీకర్‌ను సుప్రీం ధర్మాసనం సూటిగా ప్రశ్నించింది. స్పీకర్‌ను అడిగి నిర్ణయం చెపుతామని సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి తెలిపారు. ఎంత సమయం కావాలో మీరే స్పీకర్‌ను కనుక్కొని చెప్పాలని రోహత్గికి జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం సూచించింది. తదుపరి విచారణను వచ్చే వారానికి సుప్రీం కోర్టు వాయిదా వేసింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరిన సంగతి తెలిసిందే.



విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం,
01.02.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## రాష్ట్రపతి భవన్‌లో పెళ్లిసందడి

విశాలభారతి, నేషనల్ బ్యూరో:

దేశ రాజధాని ఢిల్లీలోని రాష్ట్రపతి భవ న్‌లో పెళ్లి బాజాలు మోగనున్నాయి. రాష్ట్రపతి భవన్‌లో పీఎస్‌వోగా సేవలు అందిస్తున్న సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ పూనమ్ గుప్తా వివాహానికి ఈ అత్యున్నత స్థాయి భవనం వేదికగా నిలవనుంది. రాష్ట్రపతి భవన్‌లోని మదర్ థెరెసా క్రౌన్ కాంప్లెక్స్‌లో వివాహ వేడుకను నిర్వహించుకునేందుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రత్యేకంగా అనుమతి మంజూరు చేశారు. జమ్మూకశ్మీర్‌లో సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్‌గా సేవలు అందిస్తున్న అవనీశ్ కుమార్‌తో ఫిబ్రవరి 12న పూనమ్ గుప్తా వివాహం జరగనుంది. మధ్యప్రదేశ్‌లోని శివపురి జిల్లాకు చెందిన ఆమె.. 2018లో యూపీఎస్సీ నిర్వహించిన సీఏపీఎఫ్ పరీక్షలో 81వ ర్యాంక్ సాధించారు. అనంతరం సీఆర్‌పీఎఫ్‌లో అసిస్టెంట్ కమాండెంట్‌గా పోస్టింగ్ లభించింది. గణతంత్ర దినోత్సవ కవాతులో సీఆర్‌పీఎఫ్ మహిళా దళానికి పూనమ్ సారథ్యం వహించారు.



## 'బీసీ' రాజకీయ యుద్ధభేరికి..
# వేలాదిగా తరలిరావాలి

- హలో ముదిరాజ్.. ఛలో వరంగల్
- ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షులు 'ముద్రబోయిన వెంకటేశ్వర్లు'
- రాయపర్తిలో పోస్టర్ ఆవిష్కరణ



విశాలభారతి, రాయపర్తి:

వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలో ఫిబ్రవరి 2 తేదీన జయశంకర్ ప్రాంగణం, ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్ లో జరగనున్న "బీసీ రాజకీయ యుద్ధభేరి సభ"కు బీసీలు వేలాదిగా తరలిరావాలని ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షులు ముద్రబోయిన వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం రాయపర్తి మండల కేంద్రంలో యుద్ధభేరి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ నిరుద్యోగుల పాలిట శాపంగా మారిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు వెంటనే రద్దు చేయాలని.. బీసీల రక్షణ కోసం అట్రాసిటీ చట్టం తేవాలన్నారు. బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని.. చేతి కులవృత్తులను పరిశ్రమలుగా గుర్తించి ప్రోత్సహించాలన్నారు. బీసీ పేద బిడ్డలకు ప్రభుత్వ భూములు పంపిణీ చేయాలన్నారు. ఈ సభకు ముదిరాజ్ సోదరులు పెద్ద ఎత్తున హాజరైన విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ యూత్ అధ్యక్షులు నర్సింహుల రమేష్, మండల ఉపాధ్యక్షులు కాణికుంట్ల యాకయ్య, సోడెపు ఉప్పలయ్య, కుక్కల సురేష్, బాధ రవి, యాకయ్య, సంతు తదితరులు పాల్గొన్నారు





# హెచ్ యూజే పేరును అక్రమంగా వినియోగిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

- కార్మిక శాఖ అడిషినల్ కమిషనర్ కు హెచ్ యూజే నేతల ఫిర్యాదు

విశాలభారతి, హైదరాబాద్:

హైదరాబాద్ గడ్డపై తొలిసారి ప్రభుత్వ గుర్తింపు పొందిన స్థానిక జర్నలిస్టుల సంఘం ''హైదరాబాద్ యునియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్ యూ జే. రి.నెం.B 2794.) పేరును అనధికారికంగా ఉపయోగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని హెచ్ యూ జే ప్రతినిధి బృందం కార్మిక శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. రిజిస్టర్డ్ హెచ్ యూజే సంఘం అధ్యక్షులు బి.అరుణ్ కుమార్, కార్యదర్శి బి.జగదీశ్వర్ నేతృత్వంలో ప్రతినిధి బృంధం శుక్రవారం కార్మిక శాఖ అదనపు కమిషనర్ డా.గంగాధర్, జాయింట్ కమిషనర్ సునీత గోపాల్ దాస్ తో సమావేశమయ్యారు. జర్నలిస్టుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వాల దృష్టికి తీసుకెళుతూ వాటి పరిష్కారానికి హెచ్ యూ జే నిఖార్సుగా పని చేస్తున్నదని చెప్పారు. తెలంగాణ యునియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీ యూడబ్లూజే) సంఘం తమ హైదరాబాద్ యూనిట్ కు అనధికారికంగా 'హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్ యూజే ) పేరును ఉపయోగిస్తున్నారని వారికి ఫిర్యాదు చేశారు. దానికి సంబంధించిన ఆధారాలు అందజేశారు. ఇండియన్ ట్రేడ్ యునియన్ యాక్టు, 1926 ప్రకారం 2007వ సంవత్సరం జూన్ 27న కార్మిక శాఖలో హెచ్ యూ జే రిజిస్ట్రేషన్ జరిగిందని, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్ ) అనుబంధ సంఘంగా హెచ్ యూ జే కొనసాగుతోందని వారికి వివరించారు. అనధికారికంగా తమ సంఘం హెచ్ యూ జే పేరు వాడుతున్న వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని వారు కార్మిక శాఖ అదనపు కమిషనర్ డా.గంగాధర్ ను కోరారు. దీంతో ఆయన స్పందించి విచారణ చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని గంగాధర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్ యూజే ట్రెజరర్ బి. రాజశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గంద్ర నవీన్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ సీహెచ్ మధుకర్, హెచ్ యూజే ఉపాధ్యక్షులు ఎం.రమేష్, జి. రేణయ్య, జాయింట్ సెక్రెటరీలు ఎం.జీవన్ రెడ్డి, అచ్చిన ప్రశాంత్, టీడబ్లూజేఎఫ్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ విజయానంద్, నాయకులు హరి ప్రసాద్, రోజారాణి, పలువురు సీనియర్ జర్నలిస్టులు ఉన్నారు




# పన్ను వసూళ్లలో తెలంగాణ ఫస్ట్

- సాగు విస్తీర్ణంలో మూడో స్థానం
- సాగునీరు అందే భూములు 86 శాతం
- మహిళల్లో యాజమాన్య స్ఫూర్తిని పెంచే 'వీ-హబ్'
- 2024-25 ఆర్థిక సర్వే గణాంకాల్లో సుస్పష్టం

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

పన్ను వసూళ్లలో సొంత పన్నుల సొమ్ములు సగానికిపైగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. తెలంగాణలో సొంత పన్ను వసూళ్లు 88 శాతం వరకు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. మొత్తం పన్ను రాబడుల్లో సొంత పన్నుల వసూళ్లు సగానికి పైగా ఉన్న రాష్ట్రాలు దేశంలో 15 ఉన్నాయని.. వాటిలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని శుక్రవారం పార్లమెంట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే(2024 25) వెల్లడించింది. గత సెప్టెంబరులో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రకటించిన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) విధానాన్ని ఆర్థిక సర్వే ప్రత్యేకంగా ప్రశంసించింది. చిన్న ఉత్పత్తిదారులు తమ వస్తువులను అమ్ముకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ కామర్స్ హబ్‌లను నెలకొల్పాలని భావిస్తోందని, తెలంగాణ ప్రభుత్వం ఈ విషయంలో ఇప్పటికే కొత్త ఎంఎస్‌ఎంఈ విధానాన్ని ప్రకటించిందని తెలిపింది.

దీనివల్ల ఓపెన్ నెట్‌వర్క్ డిజిటల్ కామర్స్ పోర్టల్, ప్రభుత్వ ఈ మార్కెట్ ప్లేస్ పోర్టళ్లతో విక్రయదారులను ప్రోత్సహించడం ద్వారా ఎంఎస్‌ఎంఈల్లో ఈకామర్స్ ప్రవేశించేందుకు అవకాశం కలుగుతుందని సర్వే పేర్కొంది. ప్రజలకు రక్షిత తాగునీరిచ్చేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన జల్ జీవన్ మిషన్‌ను నూటికి నూరు శాతం అమలు చేస్తున్న 8 రాష్ట్రాల్లో తెలంగాణ ఉందని ఆర్థిక సర్వే వెల్లడించింది. ఇక సేవల రంగంలో ప్రత్యేకతను ప్రదర్శిస్తున్న రాష్ట్రాల్లో ఐటీ సేవలతో కర్ణాటక, తెలంగాణ ముందున్నాయని తెలిపింది. తెలంగాణలో స్థూల రాష్ట్ర అదనపు విలువనందించే సేవల (జీవీఎస్‌వీఏ)లో మూడో వంతు రియల్ ఎస్టేట్ నుంచి లభిస్తున్నాయంది. ఐటీతోపాటు హైదరాబాద్‌లో ఆర్థిక సేవలందించే ఫిన్‌టెక్‌లు కేంద్రీకృతమవడం వల్ల కార్యాలయాలు, నివాస స్థలాలకు గిరాకీ పెరిగిందని వెల్లడించింది. తెలంగాణ, కర్ణాటక, కేరళ రాష్ట్రాలు పట్టణాల్లో సేవల ఆధారిత ఆర్థిక వ్యవస్థలపై ఎక్కువగా ఆధారపడినట్లు విశ్లేషించింది.

విస్తారంగా సాగు జలాలు అందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ దేశంలోనే మూడో స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో పంటలకు అనువైన భూమిలో 86 శాతం విస్తీర్ణానికి నీళ్లు అందుతున్నట్టు ఆర్థిక సర్వే స్పష్టంచేసింది. 20162021 మధ్యకాలంలో దేశవ్యాప్తంగా ఉన్న సాగుయోగ్యమైన భూములకు సాగునీరు అందే విస్తీర్ణం 49.3 శాతం నుంచి 55 శాతానికి పెరిగినట్టు నివేదిక స్పష్టం చేసింది. అత్యధికంగా పంజాబ్‌లో 98 శాతం సాగుభూమికి నీరు అందుతున్నదని, హర్యానా 94 శాతంతో రెండో స్థానంలో ఉన్నదని, ఆ తర్వాత తెలంగాణ మూడో స్థానంలో నిలిచిందని పేర్కొన్నది.

'వీ హబ్'పై ఆర్థిక సర్వే ప్రత్యేక ప్రశంసలు కురిపించింది. ప్రత్యేకంగా మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు చేపట్టిన తొలి ప్రయత్నంగా అభినందనలు కురిపించింది. అంతర్జాతీయ మార్కెట్‌లో మహిళా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు స్టార్టప్ ప్రారంభించేందుకు అవసరమైన ఆర్థిక, సాంకేతిక, పాలసీపరమైన సహకారాన్ని తెలంగాణ ప్రభుత్వం అద్భుతంగా అందించినట్టు సర్వే కొనియాడింది. ఇందుకు రూ.177 కోట్లు కేటాయించినట్టు తెలిపింది. వీ హబ్‌తో 6,376 అంకుర సంస్థలు, ఎస్‌ఎంఈ(స్మాల్ అండ్ మీడియం సైజ్ ఎంటర్‌ప్రైజెస్)లను ఏర్పాటు చేయగలిగిందని అభినందించింది. 87 స్టార్టప్ ప్రోగ్రామ్‌స్‌ను ప్రారంభించి 7,828 మంది మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ ఇచ్చిందని వెల్లడించింది. ఇక్కడ ఊపిరి పోసుకున్న స్టార్టప్‌లలో 75 శాతం రెండేండ్ల నుంచి విజయవంతంగా కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయని పేర్కొన్నది. మొత్తంగా 'వీ హబ్' దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని కొనియాడింది.





# గద్దర్‌ను కించపరిచేలా మాట్లాడితే ఖబర్దార్

- బండి సంజయ్‌కు సీఎం రేవంత్ వార్నింగ్
- కేసీఆర్ కు పట్టిన గతే మీకూ పడుతుందని ఆగ్రహం

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

కేంద్ర మంత్రి బండి సంజయ్ కి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఇంకోసారి గద్దర్ మీద కామెంట్స్ చేస్తే ఖబర్దార్ అని హెచ్చరించారు. మీ పార్టీ కార్యాలయాలు ఉన్న చోట గల్లీలకు గద్దర్ అన్న కాలనీ అని పేరు పెడతామన్నారు సీఎం రేవంత్ రెడ్డి. అప్పుడు మీ అడ్రస్ చెప్పుకోవడానికి కూడా గద్దర్ పేరు చెప్పుకోవాల్సి వస్తుందని కేంద్రమంత్రి బండి సంజయ్ ని ఉద్దేశించి అన్నారు. కేసీఆర్ గద్దర్ ను లోపలికి పిలవకపోతే ఆయన గడీలు బద్దలయ్యాయని సీఎం రేవంత్ అన్నారు. కేసీఆర్.. అక్కడ లేకుండా వెళ్లిపోయారని చెప్పారు. కేసీఆర్ కు పట్టిన గతే మీకూ పడుతుందని బండి సంజయ్ ను హెచ్చరించారాయన. కేసీఆర్ పరిస్థితే అలా అయితే, ఇక మీరెంత? అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో మీరు అడ్రస్ ఉండరని అన్నారు.

అహంకారం పనికి రాదని కేంద్రమంత్రి బండి సంజయ్ కి హితవు పలికారు సీఎం రేవంత్. సైద్ధాంతిక అభిప్రాయ బేధాలు ఉండొచ్చు కానీ ఇలా మాట్లాడటం కరెక్ట్ కాదన్నారు. గద్దర్.. అసమానతలు లేని సమాజాన్ని కోరుకున్నారని రేవంత్ చెప్పారు. గద్దర్ కు పద్మశ్రీ ఇవ్వనంత మాత్రాన.. ఆయన గౌరవం తగ్గదని తేల్చి చెప్పారు. గద్దర్ గౌరవాన్ని ఆకాశమంత పెంచేలా మా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. హైదరాబాద్ రవీంద్ర భారతిలో గద్దర్ జయంతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. గద్దర్ ను ఉద్దేశించి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై ఆయన ఇలా తీవ్రంగా స్పందించారు. అవార్డులు తమ వద్ద ఉన్నాయని బీజేపీ భావిస్తుందేమో కానీ, మీ పార్టీ ఆఫీసు గద్దరన్న రాష్ట్రంలో ఉందని గుర్తుంచుకోవాలన్నారు. అందుకే మీ పార్టీ ఉన్న కాలనీకి గద్దరన్న పేరును పెడతానని రేవంత్ రెడ్డి అన్నారు. "అధికారంలో ఉన్న వారు గద్దర్‌ను గేటు బయట నిలబెట్టారు. కానీ ఇప్పుడాయన గద్దె కూలిపోయింది. ఇప్పుడు గద్దరన్న వారసుడు అధికారంలో ఉన్నాడు. గద్దరన్నను గేటు బయట నిలబెట్టిన వ్యక్తి బయట ఉన్నాడు. గద్దరన్నను గేటు బయట కూర్చోబెట్టిన వారికి ఏ గతి పట్టిందో గద్దరన్నను విమర్శించిన బీజేపీకి కూడా అదే గతి పడుతుంది" అని హెచ్చరించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.

"మీరు కానీ, మీ పార్టీ కానీ.. గద్దరన్నకు వ్యతిరేకంగా, గద్దరన్న గౌరవాన్ని కించపరిచేలా మాట్లాడితే ఊరుకోను. మీ పార్టీ కార్యాలయం ఉన్న ప్రాంతానికి గద్దరన్న పేరు పెడతా. మీ పార్టీ కార్యాలయం అడ్రస్ రాసుకోవాలంటే గద్దరన్న గల్లీ అని రాసుకునేలా చేస్తా" అంటూ బీజేపీని, కేంద్రమంత్రి బండి సంజయ్‌ని ఉద్దేశించి నిప్పులు చెరిగారు సీఎం రేవంత్ రెడ్డి.

# కుంభమేళా తొక్కిసలాటపై న్యాయ విచారణ కమిటీ ఆరా

విశాలభారతి, నేషనల్ బ్యూరో:



మౌనీ అమావాస్య సందర్భంగా త్రివేణీసంగమంలో జరిగిన తొక్కిసలాట దుర్ఘటనపై యూపీ సర్కారు నియమించిన త్రిసభ్య న్యాయ విచారణ సంఘం శుక్రవారం ప్రమాదస్థలిని పరిశీలించింది. సంబంధిత అధికారులతో చర్చలు జరిపింది. అలహాబాద్ హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ హర్‌ష్‌కుమార్ సారథ్యంలోని ఈ కమిటీలో మాజీ డీజీపీ వి.కె.గుప్తా, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డి.కె.సింగ్ సభ్యులుగా ఉన్నారు. వీరంతా క్షతగాత్రులు చికిత్స పొందుతున్న స్వరూప్‌రాణి నెహ్రూ ఆసుపత్రిని సందర్శించి బాధితులతో మాట్లాడారు. లఖ్‌నవూకు తిరిగి వెళ్లేముందు జస్టిస్ హర్‌ష్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. "ప్రమాదస్థలాన్ని పరిశీలించి, పరిస్థితులు సమీక్షించాం. ఇప్పుడే ఏమీ చెప్పలేను" అన్నారు.

భక్తుల రద్దీతో కాశీలో గంగాహారతి నిలిపివేత ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాకు కోట్ల సంఖ్యలో వస్తున్న భక్తులు అక్కడి నుంచి 120 కి.మీ.ల దూరాన ఉన్న వారణాసికి భారీగా తరలివస్తున్నారు. జనం రద్దీ దృష్ట్యా ఫిబ్రవరి 5 వరకు వారణాసి ఘాట్‌ల వద్ద గంగాహారతి కార్యక్రమాన్ని నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఘాట్‌ల వద్ద ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మౌనీ అమావాస్య నుంచి కాశీలో భక్తుల రద్దీ మరింత పెరిగింది. దూర ప్రాంతాల భక్తుల తాకిడి తగ్గేవరకు ఇతరులు ఎవరూ వారణాసికి రావద్దని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. స్థానికులు అవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని పోలీస్ కమిషనరు మోహిత్ అగర్వాల్ కోరారు. కొందరు ప్రయాణికులు వారణాసి, బనారస్ రైల్వేస్టేషన్లలో చిక్కుకుపోయారని, భద్రతా బలగాలు నిరంతరం గస్తీ తిరుగుతున్నట్లు తెలిపారు.

# ఢిల్లీని ఆప్ 'రాజకీయ ఏటీఎం'గా మార్చుకుంది

విశాలభారతి, నేషనల్ బ్యూరో:

ఇతర రాష్ట్రాల్లో తమ రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకోవడానికి ఆప్ దేశ రాజధానిని రాజకీయ ఏటీఎంలా మార్చిందని ప్రధాని మోదీ విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఢిల్లీలోని ద్వారకా ప్రాంతంలో జరిగిన ప్రచారం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఆప్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఇతర రాష్ట్రాలకు తమ పార్టీని వ్యాప్తి చేసేందుకు ఢిల్లీ వాసుల జేబుల్లోంచి ఆప్ డబ్బును దోచుకుంటోందని, తద్వారా రాజధానిలో అభివృద్ధిని అడ్డుకుంటోందని ప్రధాని ఆరోపించారు. ఢిల్లీ అభివృద్ధి కోసం డబుల్ ఇంజిన్ సర్కారును ఎన్నుకోవాలని ఓటర్లను కోరారు. "ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు ఉండాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాన్ని ఆప్ అడ్డుకుంటోంది. ఢిల్లీలో పేదల కోసం కేంద్రం నిర్మించిన ఇళ్లను ఆప్ కేటాయించడం లేదు. రూ.కోట్లతో శీష్‌మహల్‌ను నిర్మించుకున్న వారికి ఈ పేదల బాధ అర్థంకాదు. భాజపా గెలిస్తే పేదలకు సొంతిల్లు కల తీరుతుంది. మొదటి క్యాబినెట్ సమావేశంలోనే ఢిల్లీలో ప్రతి మహిళ అకౌంట్లోకి రూ.2,500 వచ్చేలా చేస్తాం. ఇది నా గ్యారంటీ' అని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆప్ అవినీతిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆప్ అందరితో గొడవలు పెట్టుకోవడంలో బిజీగా ఉందని మండిపడ్డారు. దేశాన్ని పాలించే అవకాశాన్ని తమకు ప్రజలు పలుమార్లు కల్పించారని, అలాగే ఢిల్లీని పరిపాలించే అవకాశాన్ని ఇవ్వాలని ప్రధాని మోదీ ఓటర్లను కోరారు. కాంగ్రెస్ పార్టీపైనా మోదీ విమర్శలు గుప్పించారు. ఆ పార్టీకి చెందిన రాజవంశం దేశానికి యజమానిలా భావిస్తూ అహంకారంతో వ్యవహరిస్తోందని వ్యాఖ్యానించారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

శనివారం,
01.02.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com






## భీమ్‌గల్ మున్సిపల్ కమీషనర్‌గా గోపు గంగాధర్

**బాల్కొండ,విశాలభారతి:**

భీమ్‌గల్ మున్సిపల్ నూతన కమీషనర్ గా గోపు గంగాధర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.ఇదివరకు కమీషనర్ గా పనిచేసిన వై.రామకృష్ణ వరంగల్ కార్పొరేషన్ కు బదిలీ అయ్యారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ను మున్సిపల్ సిబ్బంది స్వాగతం సత్కారం చేశారు



## ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేత

**ఆర్మూర్, విశాలభారతి:**

నందిపేట్ లో ప్రాథమిక సహకార బ్యాంకు, వివేకానంద చౌరస్తా నుండి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం మరియు న్యూ బైపాస్ వెంబడి షాపూర్ రోడ్డు వరకు వీధి స్తంభాలు లైటింగ్ ఏర్పాటు చేయాలని గ్రామ విద్య కమిటీ అధ్యక్షులు భారతీయ జనతా పార్టీ నాయకులు కలిసి శుక్రవారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగ సురేష్, గాండ్ల నర్సాగౌడ్, రాజు, సాయికుమార్, పటేళ్ల రాజు, ఎర్రం మురళి, సుధాకర్ లు పాల్గొన్నారు.



## వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలి

- **మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్, 44వ వార్డు కౌన్సిలర్ కక్కిరేణి శ్రీనివాస్**

**సూర్యాపేట,విశాలభారతి:**

వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని, నాణ్యమైన బ్రాండెడ్ దుస్తుల అమ్మకం ద్వారా మంచి పేరు సంపాదించాలని మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం నాడు 44 వ వార్డులో కొత్త బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన ఆర్ లియన్ న్యూ ట్రెండ్స్ వస్త్ర దుకాణాన్ని అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం రద్దిగా వుండే ఎంజి రోడ్ లో యువత మరియు పిల్లల కోసం ఆధునిక బ్రాండెడ్ షోరూం ప్రారంభించడం హర్షణీయమని అన్నారు. వ్యాపార వర్గాలకు కాంగ్రెస్ పార్టీ అండగా వుంటుందని అన్నారు. ఈ సందర్భంగా టౌన్ ఎస్సై ఆంజనేయులు మాట్లాడుతూ షోరూం యజమానులు వ్యాపారంలో అంచెలంచెలుగా ఎదగాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. పట్టణ మరియు పరిసర ప్రాంత ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లకుండా పట్టణంలోనే షోరూం ఏర్పాటుచేయటం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఎడ్ల వీరమల్లు గంగా భవాని, దుకాణ యజమానులు అక్కినపల్లి జానకిరాం, బత్తుల సుభాషిణి రెడ్డి, రేపాల సుధీర్ రెడ్డి, రేపాల దేవేందర్ రెడ్డి, ఎల్గూరి వెంకటేశం గౌడ్, కొప్పుల రాంరెడ్డి, జంగిలి సైదులు తదితరులు పాల్గొన్నారు.



## మీలా సత్యనారాయణ జయంతి సందర్భంగా అల్పాహారం పంపిణీ

**సూర్యాపేట,విశాలభారతి:**

ప్రముఖ పారిశ్రామిక వేత్త సుధాకర్ పివిసి వ్యవస్థాపకులు స్వర్గీయ మీలా సత్యనారాయణ 94వ జయంతి సందర్భంగా సూర్యాపేట ఏరియా ఆసుపత్రి నందు పబ్లిక్ క్లబ్ ఇసి మెంబర్ రాచకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రీ భానుపురి సేవా బృందం సభ్యులు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పబ్లిక్ క్లబ్ ఇసి మెంబర్ రాచకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ మీలా సత్యనారాయణ సుధాకర్ పివిసి సంస్థను స్థాపించి వందలాది మందికి ఉద్యోగాలు, ఉపాధి కల్పించారని అన్నారు. మారుతి విద్యానికేతన్ స్థాపించి, గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించారని, సుధా బ్యాంకును స్థాపించారని కొనియాడారు. సుధాబ్యాంకు చిన్న వ్యాపారులకు రుణాలు అందజేస్తూ సహకార బ్యాంకు లకు ఆదర్శంగా నిలిచిందని అన్నారు. మీలా సత్యనారాయణ జయంతి సందర్భంగా ఏరియా ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చే రోగులకు, వారి సహాయకులకు అల్పాహారం పంపిణీ చేయడం సంతోషంగా వుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో భానుపురి సేవా బృందం సభ్యులు శ్రీరంగం రాము, జూలకంటి నాగరాజు పాల్గొన్నారు.

## ఆర్మూర్ నూతన ఎమ్మార్వో గా సత్యనారాయణ

**ఆర్మూర్, విశాలభారతి:**



ఆర్మూర్ నూతన తాసిల్దార్ గా సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఇంతకుముందు ఆర్మూర్ తాసిల్దారుగా విధులు నిర్వర్తించిన గజానన్ ముప్కాల్ కుబదిలీపై వెళ్లారు. సత్యనారాయణ ఇంతకుముందు మోర్తాడ్ తాసిల్దార్ గా విధులు నిర్వహించారు. సత్యనారాయణకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

# పేదోళ్ల రాజు.. సర్వాయి పాపన్న

- **సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం ఆవిష్కరణ**

**ఆమనగల్లు,విశాలభారతి :**



జమీందారుల అరాచకాలను సహించలేక కడుపు మండి కత్తిపట్టిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న అని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలీ శ్రీనివాస్ రెడ్డి, టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, వంశీ చంద్ రెడ్డి ,బిసి సంఘం జాతీయ అధ్యక్షులు జాజాల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఆయన పేదోళ్ల రాజు అని కొనియాడారు. గురువారం అమనగల్లు పట్టణంలోని కాటమయ్య గుట్టపై పబ్బతి ఆంజనేయ స్వామి, ఆంజనేయస్వామి, రేణుక ఎల్లమ్మ, మైసమ్మ, నవగ్రహాలు, కౌండిన్య మహర్షి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని గౌడ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రాజకీయ, ఆర్థిక సాంఘిక సమానత్వం కోసం పోరాడారు మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని,బహుజనుల అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేసిన పాపన్నగౌడ్ ఆదర్శప్రాయుడని, ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.కులమతాలకు అతీతంగా పాపన్న ఎనలేని సేవలు అందించారని గుర్తు చేశారు.బడుగుబలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు సర్వాయి పాపన్న అని పేర్కొన్నారు.సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు చేసినవారిని అభినందించారు.. అనంతరం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఇందిరమ్మ మోడల్ హౌస్ కు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. కార్యక్రమాలలో మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పిసిసి సభ్యులు అయిల్ల శ్రీనివాస్ గౌడ్,పిఎసిఎస్ ఛైర్మెన్ గంప వెంకటేష్, బీసీ జన సైన్యం స్టేట్ ప్రెసిడెంట్ నాగేష్ గౌడ్, బీసీ సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. దుర్గయ్య గౌడ్,సిఐ చరమంద రాజు,గుర్రం కేశవులు, మాజీ ఎంపీపీ నిర్మల శ్రీశైలం గౌడ్,మట్ట వెంకటయ్య గౌడ్, గుజ్జుల మహేష్, ఏనుమల్ల రమేష్, అనిల్ గౌడ్, మండ్లి రాములు రచ్చ శ్రీరాములు,అభినవ్ రెడ్డి, నాగరాజు గౌడ్, సురమల్ల సుభాష్,వడ్డేమోని శివకుమార్, చలిచీమల సతీష్, బాలస్వామి గౌడ్, మల్లయ్య గౌడ్, ముక్తాల వెంకటయ్య, మండల వైస్ ప్రెసిడెంట్ కొప్పుల లింగం గౌడ్, ఎక్సైజ్ సీఐ బధ్యనాథ్ చౌహన్, మాది జెడ్పి వైస్ చైర్మన్ బాలాజీ సింగ్,సుందూరి శేఖర్, శ్రీకాంత్ సింగ్, మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ, మాజీ వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీశైలం, మండల అధ్యక్షుడు జగన్,శ్రీకాంత్ , మాజీ ఎంపిటిసి శ్రీనివాస్ రెడ్డి,తాలూకా గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, కంఠమేశ్వర దేవాలయ చైర్మన్ చుక్కల్లా జి గౌడ్, దేవాలయ కమిటీ ఉపాధ్యక్షులు పల్లి నారాయణ గౌడ్ దూసకంటి యాదయ్య గౌడ్ , దేవాలయ కమిటీ ప్రధాన కార్యదర్శి గంగా రవీందర్ గౌడ్ , ఆమనగల్ మున్సిపాలిటీ గౌడ సంఘం అధ్యక్షులు గజ్జ వెంకటయ్య గౌడ్ , గౌరవాధ్యక్షురాలు గజ్జ యాదమ్మ, దేవాలయ కమిటీ ఆర్థిక కార్యదర్శి గజ్జ పెద్ద బాలకృష్ణ గౌడ్, ఆమనగల్లు మండల గౌడ సం సంఘం అధ్యక్షులు చుక్క నిరంజన్ గౌడ్, ఆమనగల్లు మున్సిపాలిటీ గౌడ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి గోదా సతీష్ గౌడ్ గజ నరసింహ గౌడ్, గుండ్రాతి నరేష్ గౌడ్, గజ్జే రాఘవేందర్ గౌడ్,గజ్జ కేశవులుగౌడ్,గజ్జ నిరంజన్, గజ్జ కుమార్ గౌడ్, ముకురాల శివ,గజ్జ అల్లాజి,పల్లె శ్రీధర్,గజ్జ మోహన్, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## భీమ్‌గల్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ కి వినతి పత్రం

**బాల్కొండ,విశాలభారతి**

భీమ్‌గల్ మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొదిరే స్వామి,జిల్లా ప్రధాన కార్యదర్శి కుంటా రమేష్ మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా ఎమ్మెల్యే ఎన్నికైన కేసిఆర్ అసెంబ్లీకి రావాలని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేయడం జరిగిందన్నారు. ఇటీవలే బీఆర్ఎస్ నాయకులు మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రాన్ని సమర్పించడం చూసి మండలంలోని ప్రజలందరూ నవ్వుకుంటున్నారని అన్నారు.గత పది సంవత్సరాలు పరిపాలించిన బీఆర్ఎస్ అనేక హామీలు ఇచ్చి దళితులను, గిరిజనులను,బడుగు బలహీన వర్గాలను అనేక రకాలుగా మోసం చేసి ఆస్తులు కూడా పెట్టుకున్నారని ఆరోపించారు. ధరణి తీసుకువచ్చి దళితుల భూములన్నింటిని లాక్కునారని తెలిపారు.బాల్కొండ నియోజకవర్గంలో ఎన్నికల ముందు కుల సంఘ భవన నిర్మాణాల కొరకు దొంగ ప్రొసీడింగులు ఇచ్చి కుల సంఘాలను ప్రజలను మోసం చేసిన ఘనత బీఆర్ఎస్ నాయకుడు ప్రశాంత్ రెడ్డికే దక్కిందని అన్నారు.ఏర్గట్ల మండలం దోంచంద,వేల్పూర్ మండలం అంక్సాపూర్,భీమ్‌గల్ మండలం మెండోరా గ్రామంలో మల్లన్న గుడిల మంజూరు కొరకు,మెండోరా మండలం సావేల్ గ్రామంలో మందిరం నిర్మాణం కొరకు కాంట్రిబ్యూషన్ కట్టించుకొని ఇప్పటికీ కూడా ఒక్క రూపాయి మంజూరు చేయించలేదన్నారు.కానీ కాంగ్రెస్ పార్టీ బాల్కొండ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ చిత్తశుద్ధితో వాటికి బిల్లులు ఇప్పిస్తున్నారని తెలిపారు. గత 2022 నుండి 2024 వరకు బిఆర్ఎస్ ప్రభుత్వంలో కళ్యాణ లక్ష్మి,షాది ముబారక్,సీఎంఆర్ఎఫ్ స్కీం కింద లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను కూడా ఇవ్వలేని ఘనత మీ పార్టీదేనని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే పెండింగ్ లో పెట్టిన 80వేల చెక్కులను పేద ప్రజలు నష్టపోవద్దని సీఎం రేవంత్ రెడ్డి మంజూరు చేశారన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన కళ్యాణ లక్ష్మి చెక్కులను గత మూడు నెలలుగా లబ్ధిదారులకు పంచకుండా తప్పించుకొని తిరుగుతున్న ఎమ్మెల్యే మీ ప్రశాంత్ రెడ్డి కాదా అని ప్రశ్నించారు. భీమ్‌గల్ మున్సిపల్ అభివృద్ధి కొరకు 11 కోట్ల 50 లక్షలు కార్పొరేషన్ కింద ముత్యాల సునీల్ కుమార్ మంజూరు చేయించారని తెలిపారు.మీ రాక్షస పాలన వద్దని ప్రజలు కాంగ్రెస్ కు పట్టం కట్టారు. ఇకనైనా దొంగ ధర్నాలు దొంగ దీక్షలు చేయడం మానేసి రాష్ట్రంలోని సంక్షేమ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు మద్దతు పలికినట్టయితే రాబోయే రోజుల్లోనైనా ప్రజలకు మీపై విశ్వాసం అనేది కలుగుతుంది.అలా కాకుండా అబద్ధాలు ప్రచారం చేయాలని చూస్తే ప్రజలు మీకు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు అనంతరావు,ఎస్టీ సెల్ అధ్యక్షుడు గోపాల్ నాయక్,యువజన జిల్లా ఉపాధ్యక్షుడు నాగేంద్రబాబు,ముచ్కర్ సొసైటీ చైర్మన్ దేవేందర్,మండల యువజన అధ్యక్షుడు అవినాష్,సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ దొనకంటి రాజేష్,నాయకులు మూడేళ్ల అశోక్, సిహెచ్ గంగాధర్,ఏషాల కృష్ణ, వల్లి,రహిమాన్,తోట శివ క్రాంతి, సురేష్, జాన్సన్,సాగర్,నవీద్,జిశాన్,కలీంమీరాజ్,శ్రీను,నవీన్,సంతోష్,జనార్ధన్,రామ పాల్గొన్నారు.



## ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్మిస్తాం

- **కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలి**
- **సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి**

**సూర్యాపేట, విశాలభారతి:**

ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు నిర్మిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలో ఎవరున్నా, ఏ పార్టీ ఉన్న ఇచ్చిన హామీలు అమలు కోసం ప్రశ్నిస్తామని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల హామీ అయిన ఉచిత బస్సు మినహా ఏ ఒక్క హామీని నేటికీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. ఈనెల 26 నుండి పథకాలు అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం మండలానికి ఒక గ్రామాన్ని మాత్రమే ఎంపిక చేసి చేతులు దులుపుకుందని విమర్శించారు. జెమిలీ ఎన్నికలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ ప్రతిపాదికను విరమించాలని కోరారు. పేదలకు ఇల్లు, ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇంటి నిర్మాణానికి 15 లక్షలు ఇవ్వాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలని, ఏబిసిడి వర్గీకరణ వెంటనే పూర్తి చేయాలన్నారు. కులాంతర వివాహితుల రక్షణ చట్టం తీసుకురావాలన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న టీచర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. వృత్తిదారుల రక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. ఎస్సారెస్పీ కాలువ ద్వారా నీటిని విడుదల చేసి పంట పొలాలను కాపాడాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ములకలపల్లి రాములు, మట్టిపల్లి సైదులు, కోట గోపి పాల్గొన్నారు.

## రాష్ట్రప్రభుత్వం వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

**సూర్యాపేట,విశాలభారతి:**



ఆర్యవైశ్యుల కులదేవత శ్రీ వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సూర్యాపేట జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బండారు రాజా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీ వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తూ పెనుగొండ క్షేత్రంలోని శ్రీ వాసవి మాతకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్టు వస్త్రాలు సమర్పించడం అభినందనీయమన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం వాసవి మాత ఆత్మార్పణ చేసుకున్న రోజును అధికారికంగా నిర్వహించి ఆర్యవైశ్యులను గౌరవించాలన్నారు. త్వరలో జరగబోవు మున్సిపల్ గ్రామపంచాయతీ, జిల్లా పరిషత్తులో ఆర్యవైశ్యులకు ఎక్కువ స్థానాల కేటాయించాలని కోరారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శనివారం,
01.02.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## ఫీజు రియంబర్స్మెంట్ ను తక్షణమే విడుదల చేయాలి

- బీసీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు అనంతల రామ్మూర్తి గౌడ్



**నూతనకల్, విశాలభారతి:**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా కూడా విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ ట్యూషన్ ఫీజు ల పట్ల నిమ్మకు నీరెత్తిన చందంగా వ్యవహరిస్తుందనీ రాష్ట్ర విద్యార్థి యువజన సంఘం అధ్యక్షులు అనంతుల రామ్మూర్తి గౌడ్, ఎంబీసీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు బడే సాహెబ్ లు అన్నారు. మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ రాక విద్యార్థులకు నాలుగు సంవత్సరాలు గడిచిపోతుంది. అయినా కూడా గడిచిన తెరాస ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాలు విద్యార్థులకు రావలసిన నాలుగు సంవత్సరాల రియంబర్స్మెంట్ ,స్కాలర్షిప్, ట్యూషన్ ఫీజ్ ,ఇవ్వకుండా నానా అవస్థలకు గురిచేస్తుందనీ, నాలుగు సంవత్సరాలుగా ఫీజు రియాంబర్స్మెంట్ ,రాక ఇంజనీరింగ్ ,ఇంటర్, డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు కూడా ఆస్తులను అమ్ముకొని తాకట్టు పెట్టుకొని విద్యార్థులకు చదువు చెబుతున్నారు.వారి పట్ల కనికరం లేకుండా ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థి యువజన సంఘం,ఎంబీసీ విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.



## సుప్రీంకోర్టు తీర్పును వెంటనే అమలు చేయాలి

**నూతనకల్, విశాలభారతి:**

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తెలంగాణలో వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 7వ తేదీన హైదరాబాదులో జరిగే లక్ష డప్పులు వేయి గొంతుల సభను విజయవంతం చేయాలని అందులో భాగంగా మందకృష్ణ మాదిగ అధ్యక్షతన సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగే ఎమ్మార్పీఎస్ సభకు నూతనకల్ మండలం నుండి ఎమ్మార్పీస్ అనుబంధ సంఘాల రాష్ట్ర జిల్లా మండల నాయకులతోపాటు వివిధ రాజకీయ పక్షాలకు చెందిన నాయకులు మాదిగ కుల పెద్దలు విద్యార్థులు కదిలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి పాల్వాయి పరశురాములు మాదిగ మండల అధ్యక్షులు గంగాధారి లక్ష్మణ్, గంట రవిశంకర్ కోశాధికారి మాదాస్ దయాకర్ ,మహిళా జిల్లా విభాగం నవల యశోద ,కొమ్ము విజయలక్ష్మి, పాల్వాయి మహష్ ,గణేష్ ,విజయ్, శ్రీకాంత్ ,డప్పు శీను, నాయకపు మల్లేష్ ,కిరణ్ ,గంట రామకృష్ణ మండల వివిధ గ్రామాల అధ్యక్షులు కార్యదర్శిలు తదితరులు పాల్గొన్నారు.




## సమాజ అభివృద్ధిలో విద్యార్థుల పాత్ర చైతన్యంగా ఉండాలి

**డోర్నకల్, విశాలభారతి:**

పట్టణంలోని టీపిటిఎఫ్ జిల్లా కార్యాలయం నందు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్యు) జిల్లా జనరల్ కౌన్సిల్ ని నిర్వహించుకోవడం జరిగింది. కౌన్సిల్ కు ముందుగా పిడిఎస్యు బిగిపిడికిలి జెండాను జిల్లా నాయకులు బి దేవేందర్ ఎగురవేశారు. అనంతరం విద్యార్థి అమరవీరులకు సంతాపంగా కౌన్సిల్ సభ రెండు నిమిషాలు మౌనం పాటించడం జరిగింది. కౌన్సిల్ లో ప్రజాకవి కొమిరె సాకి ప్రారంభ ఉపన్యాసం చేస్తూ నేటి సమాజంలో విద్యారంగన్ని పాలకులు సామాజిక బాధ్యత నుండి తప్పించి కార్పోరేట్ హస్తగతం చేశారు. కార్పొరేట్ శక్తులు వ్యాపార సరుకుగా మార్చి వ్యాపార లక్షణాలు పులుముకున్న విద్యా వ్యవస్థ కనీస మానవ విలువల్ని విద్యార్థులకు అందించడం లేదు. మార్కులు ర్యాంకుల వెంట విద్యార్థులను పరుగులు తీయిస్తూ మానసిక ఉల్లాసానికి విద్యార్థులను దూరం చేస్తున్నారు. నేటి బాలలే రేపటి పౌరులు అనే సూక్తిని మరిచి సన్మార్గంలో విద్యార్థులను నడిపించాల్సిన పాలకులు పరోక్షంగా పెడధోరణుల వైపు ప్రోత్సహిస్తున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జె గణేష్, జిల్లా నాయకులు నవీన్, ప్రకాష్, సౌజన్య, నూతన్, వినోద్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



## బీసీ నేతపై అక్రమ కేసులు పెడుతున్నారు

**శాలిగౌరారం, విశాలభారతి:**

తుంగతుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలకు సేవ చేస్తున్నందున ఓర్వలేక తాడోజు శ్రీకాంత్ రాజు పై అక్రమంగా కేసులు పెడుతున్నారని ఆయన భార్య తాడోజు వాణి శ్రీకాంత్ రాజ్ తెలిపారు. శాలిగౌరారం మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వాణి శ్రీకాంత్ రాజు మాట్లాడుతూ ఎక్కడ సంఘటన జరిగినా తమ భర్త హస్తం ఉందని కేసులు నమోదు చేస్తు తమ పరువుకు భంగం కలిగిస్తున్నారని అన్నారు. ఉప్పలంచ గ్రామంలోని మాజీ సర్పంచ్ బండారు మల్లయ్య హత్య కేసులో తమకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. ఆరాధ్య ఫౌండేషన్ పేరు మీద తుంగతుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలకు సేవ చేస్తున్నామని అన్నారు. బీసీ నేతగా రాజకీయంగా ఎక్కడ ఎదుగుతాడో అన్న భయంతో అక్రమంగా కేసులు బనాయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఎన్ని రోజులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడతారు అని ప్రశ్నించారు. మేము భయపడే ప్రసక్తే లేదని ప్రజలకు సేవ చేస్తామన్నారు.

## కలెక్టర్ ను కలిసిన భీమ్‌గల్ మున్సిపల్ కమిషనర్



**బాల్కొండ,విశాలభారతి**

భీమ్‌గల్ మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ శుక్రవారం జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.కమిషనర్ గోపు గంగాధర్ భీమ్‌గల్ నూతన మున్సిపల్ కమిషనర్ గా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ అంకిత్ ను కూడా మర్యాదపూర్వకంగా కలిశారు.

# 'రోడ్డు భద్రత అందరి బాధ్యత'

- రహదారి నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలి'
- ముగిసిన జాతీయ రహదారి మాసోత్సవాలు'
- ఇబ్రహీంపట్నం ఆర్టీవో సుభాష్ చంద్రారెడ్డి'




**తుర్కయంజాల్, విశాలభారతి:**

రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించి సురక్షితంగా ఇళ్లకు చేరాలని ఇబ్రహీంపట్నం ఆర్టీవో సుభాష్ చంద్రారెడ్డి సూచించారు. జనవరి 1న మొదలైన జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మన్నెగూడ ఆర్టీవో ఆఫీసు నుంచి ఇంజాపూర్ వరకు ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీవో సుభాష్‌చంద్రారెడ్డి మాట్లాడుతూ నెల రోజుల పాటు పలు పాఠశాలలు, కాలేజీల విద్యార్థులకు, ఆటో, వాహనాల డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని, సీటు బెల్టు విధిగా ధరించాలని, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. రోడ్డు నిబంధనలను పాటిస్తూ ప్రమాదాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల, సెల్ ఫోన్‌లో మాట్లాడటం, నిద్రలేమితో డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. 18 ఏళ్ల లోపు పిల్లలు వాహనాలు నడపొద్దని, వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ప్రసాద్‌రావు, ఎంవీఐలు శ్రీనివాసరెడ్డి, సుశీల్‌రెడ్డి, మున్ని, ఏఎంవీఐ అనూష, కానిస్టేబుళ్లు ధనుంజయ, జగన్, లక్ష్మణ్, హోంగార్డులు రేణయ్య, బాలకృష్ణ, శ్రీనివాస్, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## సింగరాజుపల్లిలో మన గ్రోమోర్ సెంటర్ ప్రారంభం

**దేవరుప్పల, విశాలభారతి:**

సింగరాజుపల్లి గ్రామంలో మన గ్రోమోర్ సెంటర్ ను బస్వ మల్లెశ్ గౌడ్ ప్రారంభించారు. కర్నాటక, తెలంగాణా, రాష్ట్రాల మన గ్రోమోర్ ఆపరేషన్ హెడ్ నికుంజన్ సాహూ, జోనల్ హెడ్ మురళీకృష్ణం రాజ్ పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులకు అందుబాటులో తక్కువ ధరలకు అందించడానికి ఈ గ్రామంలో మన గ్రోమోర్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగింది, మన గ్రోమోర్ ఉద్దేశం భూమి సారాన్ని పెంచుతూ, అధిక దిగుబడి నిచ్చే మన గ్రోమోర్ ఎరువులను రైతులు ఉపయోగించుకొని, అదిక దిగుబడిని పొందగలరని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్ దాస్ మల్లేష్, పిఎసిఎస్ రవిందర్ రెడ్డి, కొండ.మల్లారెడ్డి, బిల్లా యాదవ రెడ్డి, భువనగిరి.నర్సయ్య, దాసగాని. బిక్షపతి, ఏరియా మేనేజర్, సందు సురేష్, మార్కెటింగ్ మేనేజర్ దర్శనం జానకయు స్టోర్ మేనేజర్ జంగు రమేష్, అకౌంటెంట్ శ్రీనివాస్, ఫీల్డ్ ఆఫీసర్ మోడ కృష్ణ, గ్రామాల రైతులు పాల్గొన్నారు.




## అధిక శబ్దం కలిగించే సైలెన్సర్లను అమర్చితే కఠిన చర్యలు


- గత నెల రోజుల వ్యవధిలో 24 ద్విచక్ర వాహనాలకు జరిమానాలు.
- అధిక శబ్దం పర్యావరణానికి విఘాతం.
- సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్సై సాయిరాం.

**సూర్యాపేట,విశాలభారతి:**

అధిక శబ్దం కలిగించే సైలెన్సర్లను వినియోగించడం నేరం అని సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్సై సాయిరాం అన్నారు.అధిక శబ్దం ఇచ్చే సైలెన్సర్ల పట్ల కలిగే నష్టాలను శుక్రవారం సూర్యాపేట పట్టణంలో ఖమ్మం క్రాస్ రోడ్ వద్ద వాహనచోదకులకు జాతీయ రోడ్డు భద్రత మసోత్సవాల్లో భాగంగా ఎస్సై సాయిరాం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ద్విచక్ర వాహనాలకు చట్ట విరుద్ధమైన అతి ధ్వని చేసే సైలెన్సులను ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత శబ్దకాలుష్యం, ధ్వని కలుగజేసే సైలెన్స్లర్లను ఉపయోగించకూడదని యువత ఇలాంటి వాటి పట్ల దూరంగా ఉండి లక్ష సాధన కోసం శ్రమిస్తూ... బాగా చదివి జ్ఞానం సంపాదించుకోవలని అన్నారు.సురక్షత దృష్టితో ప్రతి ఒక్కరూ హెల్మెట్లు ధరించాలన్నారు. అధిక ధ్వని కలిగించే సైలెన్స్లర్లను అమర్చిన వారు వాటిని తొలగించాలని లేదంటే జరీమానా విధించడంతో పాటు కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

## కులదురహంకార హత్య నిందితులను కఠినంగా శిక్షించాలి

- రాష్ట్రంలో వరుసగా కుల దురహంకార హత్యలు
- మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కమిటీ సభ్యురాలు మస్కు అరుణ



**ఇబ్రహీంపట్నం,విశాలభారతి**

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం అన్నారం గ్రామానికి చెందిన వడ్లకొండ కృష్ణ అలియాస్ మాల బంటి ప్రేమ వివాహం చేసుకున్నాడు. వడ్లకొండ కృష్ణ ను ఈ నెల 26న అత్యంత కిరాతకంగా హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కమిటీ సభ్యురాలు మస్కు అరుణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అన్నారు. ఈ సందర్భంగా ఇబ్రహీం పట్నం మండల కేంద్రంలో మీడియా సమావేశం లో ఆమె మాట్లాడారు సమాజం అంతా మానవీయ కోణంలో ఈ హత్యను ఖండించాలని కోరారు. మూడేండ్లుగా ప్రేమించుకుంటున్న కృష్ణ, కోట్ల భార్గవి గతేడాది ఆగస్టు 7న నకిరేకల్ దేవస్థానంలో వివాహం చేసుకున్నారని అన్నారు. దీనిని జీర్ణించుకోలేని భార్గవి నాయనమ్మ బిక్షమమ్మ, సోదరులు నవీన్, వంశీ కక్షగట్టి కృష్ణను హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వరుసగా కుల దురహంకార హత్యలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ హత్యలను ఖండించకుండా ఉపేక్షిస్తుందన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి నిందితులను కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు.



## మతసామరస్యానికి ప్రతీక పటాన్ చెరు

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు,విశాలభారతి**

మినీ ఇండియాగా పేరొందిన పటాన్ చెరు నియోజకవర్గం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరు పట్టణానికి చెందిన జిఎంఆర్ యువసేన నాయకుడు సోహెల్ బృందం ఆధ్వర్యంలో అజ్మీర్ దర్గా వెళ్తున్న సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ ఆధ్వర్యంలో చదర్ కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం దర్గాకు చదర్ ను సమర్పించారు. అల్లా ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ రెడ్డి, వెంకట్ రెడ్డి, అఫ్జల్, పాండు, గూడెం విక్రం రెడ్డి, మాణిక్ రెడ్డి, మేరాజ్ ఖాన్, షకీల్, ఇమ్రాన్, మసూద్, సోహైల్, ఆదిల్, ఇర్ఫాన్, వసీం, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

## బోడుప్పల్ నూతన కమిషనర్ గా ఎ. శైలజా



**బోడుప్పల్ ,విశాలభారతి:**

బోడుప్పల్ నగర పాలక సంస్థ నూతన కమీషనర్ గా ఎ. శైలజా శుక్రవారం భాద్యతలు స్వీకరించారు. జి. ఎచ్. ఎమ్. సి. సంతోష్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ గా విధులు నిర్వహిస్తున్న ఎ. శైలజ బదిలీ పై బోడుప్పల్ నగర పాలక సంస్థ కు వచ్చారు. ఇప్పటి వరకు కమీషనర్ గా భాద్యతలు నిర్వహించిన జి. రామలింగం బదిలీ పై భువనగిరి మున్సిపాలిటీ కి వెళ్లడం జరిగినది. నూతన కమిషనర్ అయినా అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూములను కాపాడుతారో లేదో వేచి చూద్దాం.

vishalabharathi Telugu Daily

విశాలభారతి
తెలుగు దిన పత్రిక

శనివారం,
01.02.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## రోడ్డు భద్రతపై అవగాహన కల్పించిన ఎస్సై

**దేవరుప్పుల, విశాలభారతి:**

మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో రోడ్డు భద్రత మాస ఉత్సవాల సందర్భంగా వాహనదారులకు రోడ్డు భద్రతపై పాటించవలసిన నియమాలను ఎస్సై సుజన్ కుమార్ తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనం నడపాలని, ట్రిబుల్ రైడింగ్ చేయరాదని, మద్యం సేవించి,అతి వేగంగా వాహనాలు నడపవద్దని,ఈ నియమాలను ఉల్లంఘించే వాహనదారులపై చర్యలు తీసుకుంటామని అన్నారు.






## దేవాలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

- విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్

**పటాన్ చెరు,విశాలభారతి**

నియోజకవర్గంలో దేవాలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని వెలిమల గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ కామారతి సమేత బీరప్ప స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా జరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరు దైవచింతనను పెంపొందించుకోవాలని కోరారు. నియోజకవర్గం వ్యాప్తంగా పరమత సహనాన్ని పెంపొందిస్తూ ఆలయాలు చర్చిలు మసీదులు నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోమిరెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, గూడెం మధుసూదన్ రెడ్డి, దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి ఆదర్శ్ రెడ్డి, రవీందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు రవీందర్ రెడ్డి, కొమరయ్య, శ్యామ్ రావు, ఉమేష్, శ్రీనివాస్, రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## తల్లి మృతి శవంతోనే వారం
# రోజులపాటు కూతుర్ల జీవనం

**సికింద్రాబాద్, విశాలభారతి :**



సికింద్రాబాద్ వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. వారం రోజుల క్రితం ఒక మహిళ మృతి చెందగా ఆ మృతదేహంతోనే ఇద్దరు కూతుర్లు సహ జీవనం చేసిన ఘటన శుక్రవారం కలకలం రేపింది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన కథనం ప్రకారం లలిత(45)అనే మహిళ రెండు నెలల నుండి బౌద్ధభగర్ లోని ఒక ఇంట్లో తన ఇద్దరు కూతుర్లతో కలసి ఉంటుంది. దాదాపు 5ఏళ్ల క్రితమే లలిత భర్త కుటుంబ కలహాలతో వదిలి వెళ్లి పోయినట్లు తెలిపారు. తన ఇద్దరు కూతుర్లు ప్రైవేట్ ఉద్యోగాలు చేయగా వచ్చిన ఆదాయంతోనే జీవిస్తున్నారు. ఆరోగ్యంగానే ఉన్న లలిత కొద్దిగా మానసిక స్థితి కోల్పోయినట్లు కనిపిస్తుంది, మాట విధానం కూడా అలానే ఉంటుందని ఇంటి యజమాని తెలిపారు. ఈ నెల 23న మృతి చెందింది. కానీ ఈ విషయం బయటకు పొక్కకుండా కూతుర్లు ఇద్దరు శవంతోనే గడిపారు. పూర్తిగా మానసిక స్థైర్యాన్ని కోల్పోయి వారు కూడా ఆత్మహత్యకు యత్నించారు. చేతులపై కత్తితో కోసుకున్నట్లు ఆనవాలు చూపించారు. శుక్రవారం కూతుర్లు వారాసిగూడా పోలీస్ స్టేషన్ కు చేరుకొని ఫిర్యాదు చేశారు. ఘటనాస్థలికి పోలీసులు చేరుకొని క్లూస్ టీం ను రప్పించి వివరాలు సేకరించారు. ఘటనా స్థలికి ఈస్ట్ జోన్ ఏసిపి జయపాల్ రెడ్డి చేరుకొని వివరాలు సేకరించారు. ఐతే వారం రోజులు కాదు రెండు మూడు రోజుల క్రితమే మృతి చెందినట్లు అనుమానిస్తున్న పోలీసులు. అనుమానాస్పద మృతికింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసిపి తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

- గణేష్ గార్డెన్ వెంచర్ లో కుళ్లిన మృతదేహం

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**



గుర్తు తెలియని కుళ్లిన మృతదేహం లభ్యమైన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలం లోని మంగళ్ పల్లి గణేష్ గార్డెన్ వెంచర్ లో గురువారం పూర్తిగా కుళ్లి పోయిన గుర్తుతెలియని మృతదేహం లభ్యమైందనీ పోలీసులు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి స్వస్థలం నల్గొండ జిల్లా డిండి మండలం చెరుకుపల్లి గ్రామస్తుడిగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆ గ్రామాల చుట్టుపక్కల ఎవరైనా తప్పిపోయిన వారు ఉంటే 87125 71489 , 87126 62419 ఈ నెంబర్లకు ఫోన్ చేయాలని అన్నారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



## సీసీ రోడ్ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

- కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి


**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

హయత్ నగర్ డివిజన్లోని వెంకటాద్రి నగర్ లో జరుగుతున్న నూతన సిసి రోడ్ నిర్మాణ పనులను స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిసి రోడ్ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని రాబోవు కాలంలో కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మల్కాజ్గిరి పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ బండారి భాస్కర్ ,ఏ ఇ హేము నాయక్ , వర్క్ ఇన్స్పెక్టర్ సురేష్ మరియు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు చేసిన సేవలే కీర్తి కిరీటాలు

- ఎండీఆర్ ఫౌండేషన్ చైర్మన్ దేవేందర్ రాజు
- రాములు, సత్తయ్యకు ఘన సన్మానం

**పటాన్ చెరు,విశాలభారతి**



ఉద్యోగులకు ప్రజలకు చేసిన సేవలు కీర్తి కిరీటాలని పటాన్ చెరు మాజీ సర్పంచ్ ఎండిఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఎం.దేవేందర్ రాజు అన్నారు. పటాన్ చెరు పట్టణంలో గత 40 సంవత్సరాలుగా అంకితభావంతో సేవలు అందించిన ట్రాక్టర్ డ్రైవర్ సత్తయ్య, నీటిపారుదల శాఖలో అప్రతిమ సేవలు అందించిన రాములు రిటైర్మెంట్ సందర్భంగా వారిని దేవేందర్ రాజు ఘనంగా సన్మానించారు. పటాన్ చెరు పట్టణంలోని ఎండీఆర్ ఫౌండేషన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారికి శాలువాతో సత్కారించి, వారి సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా దేవేందర్ రాజు మాట్లాడుతూ రిటైర్డ్ అయిన రాములు, సత్తయ్య కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యమైన జీవితం గడపాలని ఆయన అభిలషించారు. పటాన్ చెరు పట్టణ అభివృద్ధిలో వీరి సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. సత్తయ్య ట్రాక్టర్ గ్రామ పంచాయతీ డ్రైవర్గా, అనంతరం జిహెచ్ఎంసి పరిధిలో నిరంతరం శ్రమించి, పట్టణ శుభ్రత, మౌలిక వసతుల పరిరక్షణలో కీలక పాత్ర పోషించారని, రాములు నీటిపారుదల శాఖలో పనిచేసే సమయంలో పట్టణ ప్రజలకు నిరంతర నీరు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించారని గుర్తు చేశారు. సేవా ధృక్పథం కలిగిన ఉద్యోగులు ఎల్లప్పుడూ గుర్తించబడతారని పేర్కొన్నారు. రిటైర్మెంట్ అనంతర జీవితం ప్రశాంతంగా సాగాలని దేవేందర్ రాజు కోరారు. కార్యక్రమంలో ఎం.పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.




## 3000 మంది నిరుపేద రోగులకు అన్నదానం

- నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్
- డాక్టర్ సయ్యద్ మాజీదుల్లా హుస్సేని

**హైదరాబాద్,విశాలభారతి:**

అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ కేంద్ర సంఘ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సయ్యద్ మాజీదుల్లా హుస్సేని ఆధ్వర్యంలో ఎంఎన్ జే క్యాన్సర్ ఆసుపత్రి, నీలోఫర్ ఆసుపత్రి, బస్వతారక క్యాన్సర్ ఆసుపత్రి ఆవరణలో సుమారు 3000 నిరుపేద రోగుల సహాయకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మీడియాతో డా.ముజీబ్ మాట్లాడుతూ కీర్తిశేషులైన తల్లి దండ్రుల పేరు మీద వివిధ కార్యక్రమాలు చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని, కుటుంబ సభ్యులు, మిత్రుల మరియు తోటి ప్రభుత్వ ఉద్యోగుల ప్రోతబలంతో కార్యక్రమాలు చేస్తున్నందుకు భగవంతునికి సదా రుణపడి ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో అసద్ అన్వర్ ట్రస్ట్ కోశాధికారి సయ్యద్ అసద్ఉద్దీన్, హైదరాబాద్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కే.ఆర్.రాజ్ కుమార్, ఉపాధ్యక్షులు కురాడి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి ఖాలీద్ అహ్మద్, ప్రచార కార్యదర్శి వైదిక్ శాస్త్ర, సభ్యులు ముఖీమ్ ఖురేషి, శ్రీధర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



## డిజిటల్ రంగంలో విశాలభారతిది ప్రత్యేక గుర్తింపు

- విశాలభారతి నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించిన కమిషనర్.
- అనతికాలంలో విశేష ఆదరణ
- పత్రికరంగంలో ప్రత్యేకమైన గుర్తింపు పొందిన విశాలభారతి
- పెద్ద అంబర్ పేట మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి

**పెద్ద అంబర్ పేట్ ,విశాలభారతి:**

పత్రికరంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన విశాలభారతి దినపత్రిక క్యాలెండర్ ను శుక్రవారం పెద్ద అంబర్ పేట కమిషనర్ రవీందర్ రెడ్డి చేతుల మీదిగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనతికాలంలో పత్రిక అందరికి అందుబాటులోకి వచ్చి పాఠకుల మన్ననలను పొందిందని, ఎప్పటికప్పుడు వార్తలను సేకరించి ప్రత్యేక క్లిప్పింగ్స్ ఆన్లైన్ ద్వారా పంపుతూ ప్రజలకు,అధికారులకు దగ్గరైదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశాలభారతి డైరెక్టర్ అశోక్, ఎడిటర్ గడ్డం శ్యామ్, పెద్ద అంబర్ పేట్ మున్సిపల్ మేనేజర్ కిరణ్,విశాల భారతి పెద్ద అంబర్ పేట్ ప్రతినిధి యాఖుబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.



## ప్రొఫెసర్ల వయోపరిమితి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

- తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ టీచర్స్ అసోసియేషన్
- ప్రో. గడ్డం మల్లేశం, ప్రెసిడెంట్, TAUTA

**ఓయూ,విశాలభారతి:**

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో పనిచేస్తున్న అధ్యాపకుల రిటైర్మెంట్ వయోపరిమితి అరవై సంవత్సరాల నుండి అరవైఐదు సంవత్సరాలకు పెంచడాన్ని "తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ టీచర్స్ అసోసియేషన్" స్వాగతిస్తున్నట్లు టౌటా అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం మల్లేశం తెలిపారు.ప్రభుత్వ నిర్ణయానికి హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం ఉస్మానియా యూనివర్సిటీ లో ప్రొఫెసర్ల బృందం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టౌటా అధ్యక్షుడు ప్రొఫెసర్ జి.మల్లేశం మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,మంత్రివర్గానికి, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ కి కృతజ్ఞతలు తెలిపారు. అధ్యాపకుల వయోపరిమితి పెంచడం వల్ల సీనియర్ ప్రొఫెసర్స్ లను పరిశోధన విభాగంలోనూ,విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించవచ్చని తెలిపారు, నేషనల్, ఇంటర్నేషనల్ లెవెల్ లో మంచి ర్యాంకింగ్ పొందవచ్చు అని తెలిపారు. అధ్యాపకుల వయోపరిమితి పెంచిన విధంగా యూనివర్సిటీలో ఖాళీలను కూడా భర్తీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలోనీ అన్ని యూనివర్సిటీలో డెబై ఐదు శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయనీ,ప్రస్తుతం ఇరవై ఐదు శాతం మాత్రమే పనిచేస్తున్నారన్నారు. యూనివర్సిటీల్లో సుమారుగా పదకొండు వందల మంది ప్రొఫెసర్లు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారని,వారికి ఉద్యోగ భద్రతను కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో టౌట జనరల్ సెక్రెటరీ ప్రొఫెసర్ సి.హెచ్ శ్రీనివాస్,వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ చలమల్ల వెంకటేశ్వర్లు,,ప్రొఫెసర్ మంగు, ప్రొఫెసర్,,ట్రెజరర్ఎన్.నరసింహులు,ప్రో. సరస్వతమ్మ, ప్రొఫెసర్ జె.వెంకటేశ్వర్లు,ప్రొఫెసర్ షరీఫుద్దీన్,ప్రొఫెసర్ ఎం.వి రమణారావు,ప్రొఫెసర్ పి.సతీష్ కుమార్, ప్రొఫెసర్ ఈ. విద్యాసాగర్,ప్రొఫెసర్ సరితా రాజేందర్,ప్రొఫెసర్ సంకే నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



## బాధ్యతలు చేపట్టిన సీఐ జగదీష్

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

ఇబ్రహీంపట్నం సీఐ గా జగదీష్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇప్పటి వరకు మాడ్గుల సీఐ గా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన సీఐ జగదీష్ మాట్లాడుతూ ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే తమకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల రక్షణ కోసం నిరంతరం పనిచేస్తానన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

# cinema updates



## జీవితంలో ఒక్కసారే ఇలాంటి అవకాశం: విక్కీ కౌశల్

"ఛావా'లో మాటలకు అందని భావం ఉంటుంది. ఓ దైవత్వం.. అంతులేని ప్రేమ ఉంటాయి. అందుకే ఈ కథ విన్న వెంటనే సినిమా చేయాలని నిర్ణయించుకున్నా" అంది నటి రష్మిక. ఛత్రపతి శివాజీ మహరాజ్ తనయుడు శంభాజీ మహరాజ్ జీవిత చరిత్ర ఆధారంగా లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కించిన చిత్రమే 'ఛావా'. విక్కీ కౌశల్, రష్మిక జంటగా నటించారు. దినేశ్ విజన్ నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్రంలోని "జానే తూ.." అనే గీతాన్ని శుక్రవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు.ఈ సందర్భంగా హీరో విక్కీ కౌశల్ మాట్లాడుతూ.. "ఈ సినిమాలో శంభాజీ మహరాజ్ లాంటి పాత్ర దొరకడం నా అదృష్టం. జీవితంలో ఒక్కసారే ఇలాంటి అవకాశం వరిస్తుంది. ఈ సినిమా కోసం నేను శారీరకంగా.. మానసికంగా ఎంతో కష్టపడ్డా. చిత్రీకరణకు ఆరేడు నెలల ముందు నుంచే కత్తి యుద్ధాలు, గుర్రపు స్వారీల్లో శిక్షణ తీసుకున్నా. వీటన్నింటి కంటే శంభాజీ మహారాజ్ పాత్రలోకి పరకాయ ప్రవేశం చేయడం.. ఆ పాత్రకు తగ్గట్లుగా నా మనసును సన్నద్ధం చేసుకోవడం సవాల్‌గా అనిపించింది. ఛత్రపతి శివాజీ.. శ్రీరాముడి లాంటి వారు. శంభాజీ.. సింహం లాంటి యోధుడు. ఈ పాత్రల్ని ఇంతకంటే గొప్పగా నేను వర్ణించలేను. ఇలాంటి నిజమైన యోధుల కథను ప్రేక్షకులకు చూపించబోతున్నందుకు నాకెంతో గర్వంగా ఉంది. రెహమాన్ సంగీత దర్శకత్వంలో పని చేయాలన్న కల ఈ చిత్రంతో నెరవేరింది" అన్నారు.ఈ కార్యక్రమానికి వీల్‌చైర్‌లో హాజరైంది రష్మిక. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. "ఈ సినిమాలో మహారాణి ఏసుబాయి పాత్ర కోసం ప్రత్యేకంగా సన్నద్ధమయ్యా. ముఖ్యంగా ఆ పాత్ర సంభాషణలు పలికే తీరు.. యాసను పట్టుకునేందుకు నెలల తరబడి శిక్షణ తీసుకున్నా. ఈ చిత్రం చూసిన ప్రతిసారీ నేను కంటతడి పెట్టుకున్నాను. శంభాజీ పాత్రకు విక్కీ అద్భుతంగా కుదిరారు. ఈ సినిమా అందర్నీ ఆకట్టుకుంటుంది" అంది.



## హృదయాన్ని హత్తుకునేలా తండేల్: ఆమిర్‌ఖాన్

తండేల్' హిందీ ట్రైలర్ విడుదల కార్యక్రమం శుక్రవారం ముంబయిలో జరిగింది. బాలీవుడ్ అగ్ర కథానాయకుడు ఆమిర్‌ఖాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ "తండేల్' ట్రైలర్ చాలా బాగుంది. హృదయాన్ని హత్తుకునేలా భావోద్వేగాలు ఉన్నాయి. నాగచైతన్య అద్భుతమైన నటుడు. 'లాల్ సింగ్ చద్దా' కోసం తనతో పనిచేయడం మంచి అనుభవం" అన్నారు. నాగచైతన్య మాట్లాడుతూ "అందమైన ప్రేమకథతో రూపొందిన చిత్రమిది. ఆమిర్‌ఖాన్ ట్రైలర్‌ని విడుదల చేయడం నాకు బలాన్నిచ్చింది" అన్నారు. 'పుష్ప2' విడుదల తర్వాత చోటు చేసుకున్న సంఘటనలపై ఆయన మాట్లాడుతూ "జరిగిన సంఘటనలు దురదృష్టకరం. అలా జరగకూడదు కానీ, ఆ సంఘటన తర్వాత దక్షిణాదిలో మేమంతా ఒకరికొకరం అండగా ఉన్నాం" అన్నారు. ఆమిర్‌ఖాన్‌ని ఉద్దేశించి నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ "మీతో రూ. వెయ్యి కోట్లతో ఓ సినిమా చేయాలని ఉంది. అది 'గజిని2'నే కావొచ్చేమో. ఇప్పటికే ఆ చిత్రం గురించి అందరూ రాస్తున్నారు" అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు చందూ మొండేటి, సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ పాల్గొన్నారు.



## 'హాట్ చాక్లెట్ కావాలా..?

టాలీవుడ్ హాట్ బ్యూటీ రకుల్ ప్రీత్ సింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కెరీర్ ప్రారంభంలోనే తెలుగు సినీ ఇండస్ట్రీలో పలు సినిమాలు చేసి, ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ అందాల భామ, స్టార్ హీరోల సరసన నటించి మంచి గుర్తింపు పొందింది.రకుల్ తన సినీ ప్రస్థానాన్ని వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ చిత్రంతో మొదలుపెట్టింది. హీరో సందీప్ కిషన్‌తో కలిసి నటించిన ఈ చిత్రం ఆమెకు మంచి పేరు తెచ్చింది. తర్వాత, డైలాగ్ కింగ్ సాయి కుమార్ తనయుడు ఆది సాయికుమార్‌తో రఫ్ సినిమాలో నటించింది. ప్రారంభంలో చిన్న హీరోలతో నటించినా, చాలా త్వరగా టాప్ హీరోల సరసన నటించే అవకాశాలు దక్కించుకుంది.సూపర్ స్టార్ మహేష్ బాబు, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, మెగాస్టార్ చిరంజీవి, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, రామ్ పోతినేని వంటి ప్రముఖ హీరోల సరసన వరుసగా సినిమాలు చేస్తూ టాలీవుడ్ టాప్ హీరోయిన్‌గా ఎదిగింది. తాజాగా, నార్త్ ఇండియా ప్రముఖ వ్యాపారవేత్త విక్కీ భగ్నానీతో వివాహం చేసుకుని, తమ కొత్త జీవితం ఆనందంగా గడుపుతున్నారు. భర్తతో కలిసి ఫొటోలు సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకుంటుంది రకుల్. తాజాగా, ఈ బ్యూటీ తన ఇన్స్టాగ్రామ్ ద్వారా ఒక స్పెషల్ పోస్ట్ షేర్ చేసింది. "హాట్ చాక్లెట్ ఎవరికీ కావాలి?" అనే క్యాప్షన్‌తో, చేతిలో చాక్లెట్ గ్లాస్ పట్టుకుని దిగిన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



## కార్తితో మూడోసారి ?

కథానాయకుడు కార్తి.. దర్శకుడు లోకేశ్ కనగరాజ్‌ల కలయికలో 'ఖైదీ 2' పట్టాలెక్కనుండటం ఇప్పటికే ఖాయమైంది. 'కూలీ' సినిమా పూర్తి కాగానే ఈ చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లనున్నారు లోకేశ్. కాగా, ఇందులో ఓ నాయికగా రజిషా విజయన్ పేరు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. రెగ్యులర్ హీరోయిన్ పాత్రలకు భిన్నంగా కథలో ఎంతో కీలకంగా తన పాత్ర ఉండనున్నట్లు తెలిసింది. రజిషా ఇప్పటికే కార్తితో కలిసి 'సర్దార్' సినిమాలో సందడి చేసింది. అలాగే ప్రస్తుతం దీనికి సీక్వెల్‌గా ముస్తాబవుతున్న 'సర్దార్ 2'లోనూ నటిస్తోంది. ఇప్పుడీ ప్రాజెక్ట్ కూడా ఓకే అయితే కార్తితో రజిషాకు ఇది మూడో సినిమా అవుతుంది. లోకేశ్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా ముస్తాబవుతున్న ఈ యాక్షన్ థ్రిల్లర్ ఈ ఏడాది ఆగస్టు నుంచి చిత్రీకరణ ప్రారంభించుకునే అవకాశముంది. త్వరలో మరిన్ని వివరాలు వెల్లడి కానున్నాయి.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.